ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కడప

జిల్లా వార్తలు

శనివారం 8 ఫిబ్రవరి 2025

మొక్కుబడిగా..!

- ప్రతి జడ్పీ సమావేశానికి రూ.లక్షల్లో ఖర్చు
- ఫలితంలేని తీర్మానాలు
- పరిష్కారానికి నోచుకోని ప్రజాసమస్యలు
- ఈ సారైనా అభివృద్ధిపై చర్చ సాగేనా..?
- నేడు జడ్పీ సర్వసభ్య సమావేశం



జడ్పీ సర్వసభ్య సమావేశాలు చాలా మొక్కుబడిగా సాగుతున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు వచ్చామా.. కూర్చున్నామా.. వెళ్లామా అనే రీతిలో వ్యవహరిస్తున్నారు. ఇవే సమావేశాలకు ఒకప్పుడు ప్రత్యేక విలువ ఉండేది. జిల్లా అభివృద్ధికి బాటలు వేసేలా సాగేవి. ఇందుకు తగ్గట్టుగా సమావేశంలో ఆమోదించిన తీర్మానాలు తగిన ఫలితాలను ఇచ్చేవి. వైసీపీ అధికారం చేపట్టిన నాటి నుంచి అంతా రివర్స్ అయిపోతోంది. జిల్లాలో రెండు పర్యాయాలుగా వైసీపీ పాలకమండలి కొనసాగుతోంది. ప్రస్తుతం ఉన్న జడ్పీ పాలకమండలి ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకు దాదాపు 15 జడ్పీ సర్వసభ్య సమావేశాలు జరిగాయి. ఒక్కొక్క సమావేశానికి సరాసరిన దాదాపు రూ.4 లక్షల వరకు ఖర్చు చేస్తున్నారే తప్ప.. ప్రజల సమస్యలు మాత్రం పరిష్కారానికి నోచుకోవడం లేదు.

కడప రూరల్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): జడ్పీ సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 10 గంటలకు జరగనుంది. జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, ఈ కారణంగా దెబ్బతిన్న వ్యవసాయం, తాగునీటి ఎద్దడి, రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలు తదితర అంశాలకు సంబంధించి సమస్త సమాచారాన్ని తీసుకురావాల్సిందిగా అన్ని శాఖల అధికారులకు ఇప్పటికే నిర్వాహకులు ఆదేశాలు పంపారు. ఈ క్రమంలో అధికార, ప్రతిపక్ష ప్రజాప్రతినిధులు పాల్గొంటున్న ఈ సమావేశంలో.. ఏయే శాఖలలో ఏయే పనులు చేపట్టాలి.. ఎంతెంత నిధులు అందుబాటులో ఉన్నాయనే అంశాలపై చర్చించడంతో పాటు సమస్యలపై గళం విప్పి పరిష్కారం చూపుతారనే గంపెడాశతో జనం ఎదురుచూస్తున్నారు. శాఖల వారీగా పరిశీలిస్తే..

వ్యవసాయశాఖ :




అసమతుల్య వర్షాల కారణంగా ఖరీఫ్, రబీ పంటలు దారుణంగా దెబ్బతిన్నాయి. ఖరీఫ్‌లో 66,998 హెక్టార్లలో పంటలు సాగైనా సగానికి పైగా చేతికి రాకుండా పోయాయి. రబీలో ఇప్పటి వరకు 1,02,000 హెక్టార్లు సాగు కాగా వీటిలో మెట్టపంటలు దారుణంగా దెబ్బతిన్నాయి. సమీకృత ప్రయోగశాలలు సత్ఫలితాలను ఇవ్వడం లేదు. ప్రకృతి వ్యవసాయం ద్వారా 2024-25లో 1,04,267 ఎకరాలు సాగు లక్ష్యం కాగా కేవలం 49,812 ఎకరాలలో మాత్రమే సాగుచేయించారు. తుఫాన్‌తో దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం రైతులకు సక్రమంగా అందడం లేదు.

పశుసంవర్ధకశాఖ :



పశువైద్యం గాలిలో దీపంలా మారింది. అధికారులు అందుబాటులో ఉండడం లేదని రైతులు వాపోతున్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 2024-25కు గాను జిల్లాకు 875 గోకులం షెడ్లను మంజూరు చేసింది. వీటిలో చాలా వరకు అనర్హులు నిర్మించుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. 321 పశువులు చనిపోగా 260 వాటికి మాత్రమే క్లైయిమ్ సెటిల్మెంట్ అయింది. పశుగ్రాస విత్తన సరఫరా అంతంతమాత్రమే సాగుతోంది. పెయ్యదూడల సంఖ్య పెంపు గణాంకాలకే పరిమితమవుతోంది.

జిల్లా స్త్రీ, శిశుసంక్షేమ శాఖ:



ఈ శాఖ ద్వారా జిల్లాలో మొత్తం 2,389 కేంద్రాలు పని చేస్తున్నాయి. వీటిలో 1,068 కేంద్రాలు సొంత భవనాల్లోను, 916 కేంద్రాలు అద్దెభవనాల్లో, 405 కేంద్రాలు పాఠశాల ప్రాంగణాల్లో అరకొర వసతులతో కొనసాగుతున్నాయి. అంగన్‌వాడీ భవన నిర్మాణాలకు బాలారిష్టాలు పట్టుకున్నాయి. బాల సంజీవని పథకం కిట్స్ పక్కదారి పడుతున్నాయి.

విద్యాశాఖ :



జిల్లాలో 2,816 ప్రభుత్వ పాఠశాలల్లో 3,08,343 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇందులో 1,870 ప్రాథమిక పాఠశాలల్లో 95,185 మంది, 312 ప్రాథమికోన్నత పాఠశాలల్లో 35148 మంది, 613 ఉన్నత పాఠశాలల్లో 1,78,010 మంది విద్యార్థులు ఉన్నారు. పలు పఠశాలల్లో ప్రహరీగోడలు, ఇతర మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. మధ్యాహ్న భోజనం మెనూ సక్రమంగా పాటించడం లేదని విద్యార్థులు ఆరోపిస్తున్నారు.

పంచాయతీరాజ్ శాఖ :



సిమెంట్ రోడ్లు, తారు రోడ్లు, మెటల్ రోడ్లు, కాంపౌండ్ వాల్ తదితర మొత్తం 999 పనులను రూ.8017.21 లక్షలతో చేపట్టగా.. ఇప్పటి వరకు ఇంకా 53 పనులు వివిధ కారణాలతో ప్రారంభించలేదు. అలాగే పీఎంజీఎస్‌వై కింద చేపట్టిన పలు పనులకు బిల్లుల చెల్లింపులో జాప్యంపై కాంట్రాక్టర్లు ఆందోళన చెందుతున్నారు.

పంచాయతీ శాఖ :

జిల్లాలో 557 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. చాలాగ్రామాల్లో పారిశుధ్యం పడకేసింది. 2024-25కు గాను 15వ ఆర్థిక సంఘం ద్వారా రూ.57.34 కోట్లు మంజూరైంది. ఇందుకు సంబంధించిన పనులు నాసిరకంగా చేపట్టారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వేతనాలను సక్రమంగా చెల్లించకపోవడంతో క్లాప్ మిత్రలు ఆందోళన చెందుతున్నారు. ట్రై సైకిళ్లు చాలా వరకు మూలన పడడంతో చెత్త సేకరణ నత్తనడకన సాగుతోంది. వీటన్నింటిపై జడ్పీ సర్వసభ్య సమావేశంలో చర్చించి పరిష్కారం చూపుతారని జనం ఎదురు చూస్తున్నారు.

ప్రజల సహకారంతో పక్కాగా రీసర్వే

- రీ సర్వేలో తప్పులుంటే 3సార్లు అప్పీల్ చేసుకోవచ్చు
- రైతులకోసం హెల్ప్‌లైన్ నెంబరు 8143679222
- భూముల కొలతలు, రికార్డుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మురళీకృష్ణ

ఫటాఫట్

కడప కలెక్టరేట్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రజల సహకారంతో రీసర్వే ప్రక్రియను పారదర్శకంగా, పక్కా ప్రణాళికతో తప్పులు లేకుండా చేస్తున్నామని భూముల కొలతలు, మరియు రికార్డుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కావాడి మురళీకృష్ణ స్పష్టం చేశారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లాలో జరుగుతున్న రీసర్వే ప్రక్రియపై ఆంధ్రజ్యోతి సర్వేశాఖ ఏడీతో ఫటాఫట్ ఇంటర్వ్యూ నిర్వహించింది.



ప్రశ్న: జిల్లాలో భూములు ఎన్ని ఉన్నాయి

జవాబు: జిల్లా వ్యాప్తంగా 22.36 లక్షల ఎకరాల భూ విస్తీర్ణం ఉంది. ఇందులో అటవీ, దేవదాయ, ప్రభుత్వ, ప్రైవేట్, వక్ఫ్ భూములు ఉన్నాయి.

ప్రశ్న: జగన్ సర్కారులో ఎన్ని గ్రామాల్లో రీ సర్వే జరిగింది

జవాబు: జిల్లా వ్యాప్తంగా 735 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. అందులో 285 గ్రామాల్లోని 4.44 లక్షల ఎకరాలలో రీ సర్వే పూర్తి చేశాం.

ప్రశ్న: గతంలో జరిగిన రీ సర్వేపై ఫిర్యాదులు వస్తున్నాయా

జవాబు: అప్పట్లో రీ సర్వే ఆగమేఘాలపై చేయాల్సి వచ్చింది. అందులో సర్వేలో సరిహద్దులు, భూ విస్తీర్ణంలో వ్యత్యాసాలు, భాగ పరిష్కారాలు, రెవెన్యూ రికార్డుల్లో తప్పులు వచ్చాయని రైతుల నుంచి దాదాపు 6300 వరకు ఫిర్యాదులు వచ్చాయి. వీటిలో ఇప్పటి వరకు 4,200 ఫిర్యాదులను రైతులు సంతృప్తి చెందేలా పరిష్కరించాం. మిగిలిన వాటిని ఈనెలలో పరిష్కరిస్తాం.

ప్రశ్న: ఎన్ని గ్రామాలో రీసర్వే జరుగుతోంది

జవాబు: జిల్లాలో 35 మండలాల పరిధిలో 35 గ్రామాల్లో గత నెల 20 నుంచి రీసర్వే చేస్తున్నాం. ప్రస్తుతం పూర్తి చేశాము. రీ సర్వేలో తప్పులు ఉన్నాయని రెతులు భావిస్తే 3 సార్లు అప్పీల్ చేసుకోవచ్చు. అంతే కాకుండా హెల్ప్‌లైన్ నెంబరు 8143679222 కు ఫిర్యాదు చేయవచ్చు.

ప్రశ్న: దూర ప్రాంతాల్లో ఉండే రైతులకు నోటీసులు ఇస్తున్నారా

జవాబు: రీ సర్వే సమయంలో కచ్చితంగా చుట్టుపక్కల భూముల రైతులకు నోటీసులు ఇస్తున్నాం. ఒక వేళ వాళ్లు ఇతర రాష్ట్రాలు, దేశాల్లో ఉంటే వారికి వాట్సాప్ ద్వారా చూపిస్తూ పారదర్శకంగా రీసర్వే చేస్తాం. రైతులు రికార్డులతో వస్తే డౌట్ తీరేంత వరకు సర్వే చేస్తాం.

ప్రశ్న: రీసర్వే ఇంకా ఎన్నిరోజులు చేస్తారు

జవాబు: కూటమి సర్కారు ప్రస్తుతానికి పెలెట్ ప్రాజెక్టు కింద రీ సర్వే, మ్యాపులు, రెవెన్యూ రికార్డుల ప్రక్రియకు 120 రోజులు గడువు విధించింది. సమయం ఎక్కువగా ఉన్నందున రీసర్వేలో తప్పులు దొర్లే అవకాశం ఉండదు. ప్రాజెక్టు వర్క్ బాగుందని భావిస్తే ప్రభుత్వం మిగతా గ్రామాల్లో సర్వేకు త్వరలో ఉత్తర్వులు ఇచ్చే అవకాశం ఉంది.

ప్రశ్న: ఎల్‌పీ నెంబర్ల సమస్య పరిష్కరిస్తున్నారా

జవాబు: గతంలో రీ సర్వే జరిగిన 285 గ్రామాల్లో లాండ్ పార్శల్ నెంబరు(ఎల్‌పీఎం) సమస్యలు ఉన్నాయి. వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నాం. ఇలాంటి భూముల్లో జనవరి 15 నుంచి జూన్ వరకు సబ్ డివిజను చేసేందుకు ప్రభుత్వం ఫీజు మినహాయింపు ఇచ్చింది. సబ్ డివిజన్లకు చలానా రూ.550 చెల్లించాల్సిన పని లేదు. రైతులు సర్వే సమయంలో అందుబాటులో ఉంటే తప్పులు లేకుండా రీ సర్వే విజయవంతంగా పూర్తి చేస్తాం.

వేసవిలో నీటిపై ప్రత్యేక దృష్టి

- కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్

కడప కలెక్టరేట్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): వేసవిలో గ్రామీణ ప్రాంతాల్లో నీటి అవసరాలపై ప్రత్యేక దృష్టి సారించి, ముందస్తు ప్రణాళికలు చేపట్టాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాల్లో పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి అవసరాల సన్నద్ధతపై సంబంధిత మున్సిపల్, ఇంజనీరింగ్ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ వేసవిని దృష్టిలో పెట్టుకుని పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని అన్ని ప్రాంతాలకు కొరతలేకుండా తాగునీటి సదుపాయం కల్పించేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. మార్చి 20వ తేదీ లోగా పులివెందుల పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో సమృద్ధిగా తాగునీరు అందేలా పెండింగ్ పనులను తక్షణమే పూర్తిచేయాలన్నారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా నీటి ఎద్దడి లేకపోయినప్పటికీ ఈ వేసవిలో అన్ని గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి అవసరాలకు సరిపడా ప్రత్యామ్నాయ ప్రణాళికలు రూపొందించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జల్ జీవన్ మిషన్ ద్వారా చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి పులివెందుల మున్సిపాలిటీకి తాగునీరందించే పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో పులివెందుల ఆర్డీవో చిన్నయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ వీరన్న, ఈఈ విజయభాస్కర్, మున్సిపల్ కమిషనర్ రాముడు, ఈఈ చిదానంద రెడ్డి, పబ్లిక్ హెల్త్ ఈఈ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

10 నుంచి కందులు కొనుగోలు

కడప కలెక్టరేట్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా 10వ తేదీ నుంచి మద్దతు ధరతో కందులు కొనుగోలు చేయనుందని జేసీ అదితిసింగ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్వింటాల్ కందులు రూ.7550లతో కొనుగోలుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని తెలిపారు. ఇంకా రైతుసేవా కేంద్రంలో పేర్లు నమోదు చేయించుకోని రైతులు వెంటనే నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ-క్రాప్‌లో పేర్లు నమోదు చేసుకున్న రైతులు పండించిన కంది పంటను మాత్రమే కొనుగోలు చేస్తారని, కందులు అమ్మకం చేసే రైతాంగం తేమ 12 శాతం మించకుండా చూసుకోవాలని తెలిపారు. జిల్లాలో కందులు పండించి, ఈ-క్రాప్ చేయించుకున్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విమానాశ్రయ అభివృద్ధికి చర్యలు : కలెక్టర్

కడప కలెక్టరేట్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): కడప విమానాశ్రయం అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాల్లో కలెక్టర్ అధ్యక్షతన ఏరోడ్రమ్, ఎయిర్‌ఫీల్డ్ ఎన్విరాన్మెంట్ మేనేజ్మెంట్ కమిటీల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం భారతీయ విమానాశ్రయాలను ఉన్నత ప్రమాణాలతో అంతర్జాతీయ స్థాయికి ధీటుగా అభివృద్ధి చేస్తోందన్నారు. ఆధునిక జీవన శైలికి అనుగుణంగా విమానాశ్రయాల్లో సౌకర్యాలను మెరుగు పరుస్తోందన్నారు. కడప విమానాశ్రయం నుంచి భవిష్యత్తులో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని నూతన టెర్మినల్ భవన నిర్మాణానికి చర్యలు చేపట్టిందన్నారు. నూతన టర్మినల్ భవన అభివృద్ధి పనుల అనంతరం కడప విమానాశ్రయం అత్యుత్తమ శ్రేణి ఎయిర్ పోర్టుగా సంతరించుకోనుందన్నారు. ఎయిర్‌పోర్ట్ నూతన టెర్మినల్ అభివృద్ధి పనుల్లో భాగంగా ఎయిర్ పోర్ట్ అథారిటీ, ఆర్‌అండ్‌బి, నేషన్ హైవే పోలీసు శాఖలు జాయింట్ కమిటీగా ఏర్పాటై అందుకు సంబంధించిన రోడ్లు, రవాణా వ్యవస్థ తదితర మౌలిక సదుపాయాల ఏర్పాట్లను పర్యవేక్షిస్తుందన్నారు. పర్యావరణ, అటవీ శాఖ అనుమతులను పరిశీలించి మౌలిక సదుపాయాల ఏర్పాటుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. కొరత ఉన్న భద్రతా సిబ్బందిని కూడా పూరించేందుకు సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ బి.రమణయ్య, విమానాశ్రయం డైరెక్టర్, కమిటీ కన్వీనర్ సుజిత్‌కుమార్ పోదర్, మున్సిపల్ కమిషనర్ మనోజ్‌రెడ్డి, కడప ఆర్డీవో జాన్ ఇర్విన్, డీజీఎంలు రాజశేఖర్, పీవీ శ్రీధర్, జేఈబీ నిఖిల్, టెర్మినల్ మేనేజరు ఎన్.జోబన్న, డీఎంహెచ్‌వో డాక్టర్ నాగరాజు, ఎన్‌హెచ్ జేడీ శారదమ్మ, ఆర్ అండ్ బీ ఎస్ఈ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

నవదిన ప్రార్థనలు

కడప కల్చరల్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మరియాపురం లూర్దుమాత తిరునాళ్లలో భాగంగా శుక్రవారం స్థానిక పాత చర్చి ఆవరణలో నవదిన ప్రార్థన ఆధ్యాత్మిక సభ నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్య బలి పూజకు హాజరైన మరియాపురం అభిషిక్త గురువులు హృదయరాజు విశ్వాసులను ఉద్దేశించి దైవ సందేశం వినిపించారు. దేవుని పట్ల విశ్వాసంతో ఉన్నప్పుడే జీవితం సుఖమయంగా సాగుతుందన్నారు. మన శత్రువును కూడా ప్రేమపూర్వకంగా చేరదీసినప్పుడే దేవుడు మన పట్ల సంపూర్ణంగా కరుణ చూపుతారన్నారు. కాగా.. నవదిన ఉత్సవాలను పురస్కరించుకుని తిరుణాల కమిటీ అధ్యక్షుడు జ్యోతి రాయప్ప, కార్యదర్శి ప్రదీప్, వైస్ ప్రసిడెంట్ బాలశౌరి, సహాయకార్యదర్శి ఆనంద్, ట్రెజరర్ ప్రసాద్ సారథ్యంలో మరియాపురం పాత చర్చి ఆవరణాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో నింపేశారు. కార్యక్రమంలో మరియాపురం విచారణ గురువు ఫాదర్ మరియన్నతో పాటు వారాధి జోషఫ్, అధిక సంఖ్యలో విశ్వాసులు పాల్గొన్నారు.



మరియాపురం లూర్దుమాత తిరునాళ్లలో నవదిన ప్రార్థనలకు హాజరైన విశ్వాసులు

రుణాల దరఖాస్తు గడువు పొడిగింపు

కడప ఎన్జీఆర్ సర్కిల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ల రుణాలను అర్హులందరికీ అందజేయడానికి, లబ్ధిదారుల నుంచి వస్తున్న వినతులను దృష్టిలో పెట్టుకొని దరఖాస్తుల గడువును ఫిబ్రవరి 7 నుంచి 12వ తేదీ వరకు పెంచారు. అర్హులైన నిరుద్యోగ యువత స్వయం ఉపాధి యూనిట్ల స్థాపన కోసం ఈనెల 12లోపు దరఖాస్తు చేసుకోవాలని బీసీ కార్పొరేషన్ ఈడీ జయసింహ కోరారు. జిల్లాలో ఇప్పటివరకు 1863 యూనిట్లకు సంబంధించి 10720 మంది అర్హులు రుణాలకు దరఖాస్తు చేసుకున్నారన్నారు. మరో 48 మంది జనరిక్ మెడికల్ స్టోర్‌ల కోసం దరఖాస్తు చేసుకున్నారని, తాజాగా జిల్లాలోని మేదర, కుమ్మరి సామాజిక వర్గాలకు చెందిన అర్హులకు రుణాలు అందించేందుకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయన్నారు. ఈ కులాలకు చెందిన వారు ముగ్గురు సభ్యులు ఒక బృందంగా ఏర్పడి రుణం పొందవచ్చన్నారు. ఒక గ్రూప్‌నకు రూ.3లక్షల రుణం మంజూరు అవుతుందని.. ఇందులో రూ.1.50లక్షల రాయితీ ఉంటుందన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా రాజ్యలక్ష్మి



కడప ఎన్జీఆర్ సర్కిల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్డ్ కులాల ఆర్థిక సహకార సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా డాక్టర్ జి.రాజ్యలక్ష్మి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఆమెను ఏడాది పాటు డిప్యూటేషన్‌పై ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా కడపకు బదిలీ చేశారు. ఈ మేరకు ఆమె బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయ సిబ్బంది ఆమెకు అభినందనలు తెలిపారు.

ఇసుక రీచ్ వద్దేవద్దు

- తేల్చి చెప్పిన ప్రజలు
- ప్రజాభిప్రాయ సేకరణలో రసాభాస

జమ్మలమడుగు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మండలం గొరిగెనూరు, కన్నెలూరు మధ్య ఇసుక రీచ్ వద్దేవద్దని ప్రజలు డిమాండ్ చేశారు. దీంతో ప్రజాభిప్రాయ సేకరణలో కాసేపు గందరగోళం ఏర్పడింది. పెన్నానదిలో గొరిగనూరు, కన్నెలూరు మధ్య ఇసుక రీచ్ ఏర్పాటుకు సంబంధించి శుక్రవారం జమ్మలమడుగు మండలంలోని గొరిగెనూరు మండల ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ ఏర్పాటు చేశారు. జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ, కాలుష్య నియంత్రణ మండలి కడప ఈఈ సుధ ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. అధికారులు ఇసుక రీచ్‌కు సంబంధించిన నిబంధనలు తెలియజేశారు. సర్వే నంబరు 515లో గొరిగెనూరు, సర్వే నంబరు 462లో కన్నెలూరుకు సంబంధించి ఇసుకరీచ్ ఏర్పాటు చేయనున్నట్టు వివరించారు. దీంతో గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ తమ గ్రామంలో ఇసుక రీచ్ వద్దన్నారు. ఆర్డీవో మాట్లాడుతూ ఇసుక రీచ్‌కు సంబంధించి ఇది ప్రజాభిప్రాయ సేకరణ మాత్రమేనన్నారు. ఈఈ సుధ మాట్లాడుతూ ఇసుక రీచ్‌ను పర్యావరణ అనుమతి, నిబంధనల ప్రకారమే ఏర్పాటు చేస్తామన్నారు. రీచ్ వద్ద సీసీ కెమెరాలు ఉంటాయన్నారు.

గొరిగెనూరు సర్పంచ్ పి.మత్తయ్య మాట్లాడుతూ.. గ్రామంలో దాదాపు 90 శాతంపైగా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నామని తెలిపారు. చుట్టూ రెండు కిలోమీటర్లకుపైగా పెన్నానది బోర్ల నుంచి నీటి సరఫరాతో పంటలు పండించుకుంటున్నారన్నారు. ఇసుక రీచ్ వస్తే గ్రామంలోని ప్రజలంతా రోడ్డున పడే అవకాశం ఉందని, తమ గ్రామంలో ఇసుక రీచ్ వద్దని అన్నారు. ఇసుక రీచ్ ఏర్పాటు చేస్తే తిరుగుబాటు తప్పదన్నారు. వెంటనే తహశీల్దారు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. పెన్నానదిలో బోర్లకు ఎవరు అనుమతి ఇచ్చారని ప్రశ్నించారు. డీఎస్పీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజాభిప్రాయం చెప్పాలని, అనవసరంగా మాట్లాడటం తగదని సూచించారు. గొరిగెనూరులో ఇసుక రీచ్ వద్దంటూ గ్రామస్థులంతా ముక్తకంఠంతో చెప్పారు. తాము పెన్నానదిలో వేసిన బోర్ల ద్వారా వడ్లు పండించి అమ్ముకుంటున్నామని.. ఇసుకరీచ్ వస్తే తాము వడ్లు కొనే పరిస్థితి వస్తుందన్నారు. ఈఈ సుధ మాట్లాడుతూ ప్రజాభిప్రాయ సేకరణలో చెప్పిన విషయాలన్నీ రికార్డు చేసి ఉన్నతాధికారులకు పంపుతామని చెప్పి కార్యక్రమం ముగించారు.



గొరిగెనూరు ప్రజాభిప్రాయ సేకరణలో ఇసుక రీచ్ వద్దంటూ హెచ్చరిస్తున్న గ్రామస్థులు

వేడుకగా పుష్పయాగం





కడప కల్చరల్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): దేవుని కడప లక్ష్మీవేంకటేశ్వరునికి పుష్పయాగం వేడుకగా నిర్వహించారు. జనవరి 29వ తేదీన ప్రారంభమైన స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారంతో ముగిశాయి. అయితే బ్రహ్మోత్సవాలలో ఏదేని పొరపాట్లు జరిగివుంటే ఆ దోషాలకు పరిహారంగా శుక్రవారం సాయంత్రం 6 గంటలకు ఆలయంలో స్వామివారికి పుష్పయాగం నిర్వహించారు. వివిధ పుష్పాలతో ఆలయంలో ప్రత్యేక వేదికను అలంకరించి శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడిని ఆశీనులను గావించారు. పరిమళ పుష్పాలతో ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణమోహన్, త్రివిక్రమ్, కృష్ణమూర్తి, సాయి, తరుణ్ వేదమంత్రాల నడుమ అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడికి పుష్పయాగం కనులపండువగా సాగింది. తిరుమల తిరుపతి దేవస్థానం అన్నమాచార్య ప్రాజెక్ట్ వారిచే ఆలపించిన అన్నమయ్య సంకీర్తనలతో దేవుని కడప ఆలయం ఆధ్యాత్మికశోభను సంతరించుకుంది. టీటీడీ పర్యవేక్షణలో విజయవంతంగా సాగిన దేవునికడప ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు పుష్పయాగంతో ముగిశాయి. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డితో పాటు పలువరు భక్తులు పాల్గొన్నారు.



గంజాయి నిషాలో విద్యార్థులు తూగుతున్నారు. తల్లిదండ్రుల పర్యవేక్షణ లేకపోవడంతో విద్యకు దూరమై.. మత్తుకు బానిసయ్యారు. స్కూల్, కళాశాల పేరుతో ఇంట్లో నుంచి రావడం.. ఊరికి దూరంగా వెళ్లి గంజాయిని పీల్చేస్తున్నారు. పట్టణంలోని ఉద్యోగుల పిల్లలు సైతం గంజాయి, మద్యానికి అలవాటుపడి పెడదోవ పడుతున్నారు. ఎటుచూసినా కర్ణాటక మద్యం ప్యాకెట్లు, మాదక ద్రవ్యాలే దర్శనమిస్తున్నాయి. పోలీసులు చర్యలు తీసుకొని, యువతకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తే కొద్ది మేర తగ్గే అవకాశం ఉంది.

గంజాయి పీల్చేస్తున్నారు..!

- విద్యకు దూరమై.. మత్తుకు బానిసై
- పెడదోవ పడుతున్న యువత
- గుట.. గుటా తాగేస్తున్న కర్ణాటక మద్యం
- అధికారుల నిర్లక్ష్యమే కారణమా..?

వాల్మీకిపురం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ప్రాంతాల్లో గంజాయి, కర్ణాటక మద్యం విక్రయాల వాడకం ఎక్కువైందని ఆరోపణలు వస్తున్నాయి. వీటి అక్రమ రవాణా సులభతరం కావడంతో పట్టణంలోని జగనన్న కాలనీ, బైపాస్ రోడ్డుకు సమీపాన అటవీ ప్రాంతం వద్ద యువత ఎక్కువగా గంజాయి మత్తులో ఉంటున్నట్లు పలువురు చెబుతున్నారు. అలాగే స్థానిక రైల్వేస్టేషన్ ప్రాంతం, సమీప వ్యవసాయ పొలాల వద్ద యువకులు రహస్యంగా గుమికూడి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్న విమర్శలున్నాయి. పట్టణంలోని ఉద్యోగుల పిల్లలు సైతం గంజాయికి బానిసలై పెడదోవ పడుతున్నట్లు తెలిసింది. ముఖ్యంగా విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లకుండా మత్తులో తూగుతున్నారు. పోలీసులు గంజాయి, మద్యం అక్రమ రవాణాపై నిఘా పెట్టాలని పలువురు కోరుతున్నారు.

శ్రుతిమించిపోతున్న మందుబాబుల ఆగడాలు

స్థానిక ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంతంలో నిత్యం మందుబాబుల ఆగడాలు శ్రుతిమించిపోతున్నాయి. డిగ్రీ కళాశాల, ఉర్దూ హైస్కూల్, పరిసరాల్లో మద్యం దుకాణం ఉండడం, ఉదయం దుకాణం తెరిచిన సమయం నుంచి సాయంత్రం వరకు ఆ ప్రాంతంలో మందుబాబుల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. నిత్యం కళాశాల సమీపంలో మందుబాబుల చేసే చేష్టలకు విస్తుపోతున్నారు. ఈ వ్యవహారంపై స్థానిక అధికారులు సైతం ఏమీ చేయలేక మిన్నకుండిపోయినట్లు తెలిసింది. కళాశాల ముఖద్వారం సమీపంలో ముళ్లపొదలు విపరీతంగా పెరిగిపోవడం, ఎటుచూసినా మద్యం బాటిళ్ల దుర్గంధమే దర్శనమిస్తోంది. యువత ఈ వ్యవహారం పట్ల ఆకర్షితులై జీవితాలను దుర్భరం చేసుకోకుండా పోలీసులు కూడా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. అలాగే వాల్మీకిపురంలో గంజాయి, కర్ణాటక మద్యం అక్రమ రవాణాతో విక్రయాలు సాగిస్తున్న వ్యక్తులపై పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



వాల్మీకిపురం రైల్వే ట్రాక్‌పై తిరుగుతున్న విద్యార్థులు





వాల్మీకిపురం రైల్వే స్టేషన్ ప్రాంతంలో రహస్యంగా యువకుల సెల్‌ఫోన్ మంతనాలు

ఎటు చూసినా కర్ణాటక మద్యం ప్యాకెట్లే...

రెండేళ్ల కాలంగా వాల్మీకిపురం పట్టణ వ్యాప్తంగా కర్ణాటక మద్యం ఏరులై పారుతోంది. అర్ధరాత్రి సమయాల్లో కర్ణాటక మద్యం అక్రమంగా తరలించడంతో పాటు విక్రయాలకు ఈ ప్రాంత పరిసరాలు కేంద్రంగా మారాయి. ఎటు చూసినా తాగి పడేసిన కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు దర్శనమిస్తుంటాయి. పోలీసులు కర్ణాటక అక్రమ మద్యంపై ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టి కేసులు నమోదు చేసినప్పటికీ అక్రమ మద్యం మాత్రం వస్తూనే ఉంది. స్థానిక ఆర్టీసీ బస్టాండ్, జగనన్న కాలనీ, ఇందిరమ్మకాలనీ, తరిగొండ రోడ్డు, రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాలలో కర్ణాటక అక్రమ మద్యం విచ్చలవిడిగా విక్రయాలు కొనసాగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.



వాల్మీకిపురంలో మందుబాబులు తాగి పడేసిన కర్ణాటక మద్యం ప్యాకెట్లు

ముమ్మర నిఘా పెట్టాం



వాల్మీకిపురం మండల వ్యాప్తంగా గంజాయి, కర్ణాటక అక్రమ మద్యం, నాటుసారా తయారీ, విక్రయాలపై ముమ్మర నిఘా పెట్టి చర్యలు తీసుకుంటున్నాం. గంజాయి విక్రయాలు, వాడకంతో పట్టుబడితే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదు. మద్యం మత్తులో జీవితాలను దుర్భరం చేసుకుంటున్నామన్న విషయాన్ని ముఖ్యంగా యువత గమనించాలి. కర్ణాటక మద్యం అక్రమ రవాణా, విక్రయాలపై సర్కిల్ పరిధిలోని వాల్మీకిపురం, గుర్రంకొండ మండలాల్లో గట్టి నిఘా పెట్టి చర్యలు తీసుకుంటున్నాం. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల భవిష్యత్తు విషయమై ఎప్పటికప్పుడు శ్రద్ధ వహించాలి. ఎక్కడైనా సరే గంజాయి, కర్ణాటక మద్యం, నాటుసారా విక్రయాల విషయం తెలిస్తే తక్షణం పోలీసులకు సమాచారం అందించాలి.

- ప్రసాద్‌బాబు, సీఐ, వాల్మీకిపురం

ఇద్దరు దొంగలు అరెస్ట్

- రూ.99 వేల విలువైన వెండి వస్తువులు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న వెండి వస్తువులు, నిందితులతో ఏఎస్పీ

నందలూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కడప - తిరుపతి ప్రధాన రహదారిలోని మూసివేసిన ఆల్విన్ కర్మాగారం వద్ద శుక్రవారం ఇద్దరు దొంగలను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.99 వేల విలువైన వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు రాజంపేట ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్ హెగ్డే తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శుక్రవారం ఉదయం 11.30 గంటల సమయంలో ఆల్విన్ ఫ్యాక్టరీ గేటు వద్దకు వెళ్లిన ఎస్ఐ వెంకటేశ్వర్లును చూసి పారిపోయేందుకు ప్రయత్నించిన తలారి బాలకృష్ణ, పుల్లగుంట రామాంజిని వెంబడించి అదుపులోకి తీసుకున్నారన్నారు. వారి వద్ద ఉన్న సంచిలో మూడు వెండి కిరీటాలు, రెండు వెండి పళ్లాలు, మూడు వెండి దీపాలు ఒక శఠగోపము గుర్తించి స్వాధీనం చేసున్నారని తెలిపారు. ఆడపూరులోని మంచాలమ్మ ఆలయంలో గత డిసెంబరు 24న చోరీకి గురైన వస్తువులుగా వీటిని గుర్తించామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు. ఈ కేసులో కీలకంగా వ్యవహరించిన కానిస్టేబుల్ దర్బార్‌బాషాను ఏఎస్పీ అభినందించారు. ఈ సమావేశంలో రాజంపేట రూరల్ సీఐ బీవీ రమణ, ఏఎస్ఐలు సుబ్బరాయుడు, శంకర్‌నాయక్, హెడ్‌కానిస్టేబుల్ రాజగోపాల్, పోలీసులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్యాయత్నం

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని పోలీసులు తెలిపారు. మదనపల్లె ఆస్పత్రి అవుట్ పోలీసుల వివరాల మేరకు... బి.కొత్తకోట మండలం, గట్టు పంచాయతీ, తొట్లవారిపల్లెకు చెందిన దేవేంద్ర భార్య లిఖిత(19)ఓ ప్రైవేటు కళాశాల్లో ఇంటర్ చదువుతోంది. శుక్రవారం తన మామ చిన్నపరెడ్డి గొడవ పడడంతో మనస్తాపానికి గురై విషద్రావణం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబసభ్యులు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

నాలుగు నియోజకవర్గాల తాగునీటికి జేజేఎం పథకం

- రూ. 2,904 కోట్లతో నూతన ప్రాజెక్టుకు డీపీఆర్
- వెలిగల్లు నుంచి నీటి సరఫరా




మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని మదనపల్లె, పుంగనూరు, పలమనేరు, కుప్పం నియోజకవర్గాల ప్రజలకు తాగునీరు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.2,904కోట్ల అంచనాతో వెలిగల్లు రిజర్వాయర్ నుంచి నీటి సరఫరాకు నూతన ప్రాజెక్టు కోసం డీపీఆర్ (డీటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు) తయారు చేసిందని మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే నివాసం వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రతి వేసవిలోనూ పట్టణాలు, గ్రామాల్లో తాగునీటి సమస్య వస్తోందని, దీన్ని దృష్టిలో పెట్టుకుని జల్‌జీవన్ మిషన్ కింద ఓవర్‌హెడ్ ట్యాంకులు, పైప్‌లైన్లు వేస్తారన్నారు. నియోజకవర్గంలో మదనపల్లె సహా 640 గ్రామాల్లో ప్రతి ఇంటికీ తాగునీటిని అందించేందుకు ఈ పథకాన్ని అమలు చేస్తారన్నారు. ఈ ప్రాజెక్టు పనులకు త్వరలోనే టెండర్లు పిలుస్తారని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబు భవిష్యత్‌లో 30 ఏళ్లకు సరిపడా ప్రణాళికలతో పథకాలు అమలు చేస్తారన్నారు. మదనపల్లెను జిల్లా కేంద్రంగా చేసేందుకు చంద్రబాబు సుముఖంగా వున్నారన్నారు. మదనపల్లెలో ఆటోనగర్ ఏర్పాటుకు పూర్తిగా కృషి చేస్తానన్నారు. చిత్తూరు బస్టాండు నుంచి డీఎస్పీ కార్యాలయం వరకు రోడ్డు 100 అడుగుల వెడల్పు చేసేందుకు ప్రతిపాదనలు సీఎం దృష్టికి తీసుకెళ్లగా, ఆయన ఆర్అండ్‌బీ అధికారులను సర్వే చేయాలని ఆదేశించారన్నారు. పట్టణ శివారులో ఔటర్ రింగ్ రోడ్డుకు కృషి చేస్తామన్నారు. ప్రభుత్వాస్పత్రిని ప్రైవేటు పరం చేయనీయమని, మెడికల్ కాలేజిని పీపీపీ విధానంలోకి తీసుకొస్తామన్నారు. శనివారం తమ కార్యాలయం వద్ద ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) నిర్వహిస్తున్నామని, ప్రజలు వారి సమస్యలను తన దృష్టికి తీసుకురావచ్చన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు ఆర్జే వెంకటేశ్, సుద్దిళ్ల సుధాకర్, నాదెళ్ల శివన్న, షంషేర్, చిన్న మహేష్, ఎంపీటీసీ దేవేంద్ర, బెల్లె రెడ్డిప్రసాద్, జేసీబీ మధు, కమలమర్రి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇదో రకం అధికార దర్పం...!

పీలేరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల్లో మహిళా ప్రజాప్రతినిధుల స్థానంలో వారి భర్త లేదా సంతానం పెత్తనం చెలాయించడం మనం చూస్తూ ఉంటాం. పెత్తనం చెలాయించినా అధికారిక కార్యక్రమాల్లో మాత్రం వారిని ఉత్సవ విగ్రహాల్లానైనా అప్పుడప్పుడూ వేదికలపై కూర్చోనిస్తారు. శిలాఫలాకాల్లో వారి పేర్లు వేయిస్తూ ఉంటారు. పీలేరు పంచాయతీ పాలకవర్గం మాత్రం ఇంకో అడుగు ముందుకు వేసి అధికారికంగా ఆవిష్కరించిన శిలాఫలకంలోనూ మహిళా వార్డు సభ్యుల పేర్ల కంటే ముందు వారి భర్తల పేర్లు వేయించి సరికొత్త ట్రెండ్‌కు తెరలేపారు. కాస్త ఆలస్యంగా వెలుగు చూసిన ఈ వ్యవహారం ఇలా ఉంది పీలేరు పంచాయతీ కార్యాలయం మీద శాశ్వత జాతీయ జెండాను ఆవిష్కరణ, మొదటి అంతస్తును(అది ఇంకా పూర్తి కాలేదు) 2023లో ఆర్భాటంగా ప్రారంభించారు. ఆ సందర్భంగా అప్పటి ప్రజాప్రతినిధులు, పంచాయతీ పాలకవర్గసభ్యులు, అధికారుల పేరిట శిలాఫలకం ఏర్పాటు చేశారు. ఆ శిలాఫలకంలో 2, 3, 5, 8, 10, 15, 18 వార్డుల్లో ఉండాల్సిన మహిళా సభ్యుల పేర్ల కంటే ముందు వారి భర్తల పేర్లు వేశారు. దీంతో ఆ శిలాఫలకం చూసిన వారు, ఇంతకీ వార్డు మెంబర్లు మహిళలా, పురుషులా అంటూ అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా పంచాయతీ సమావేశాల్లోనూ మహిళా సభ్యులు కనిపించరని పంచాయతీ సిబ్బంది గుసగుసలాడుకుంటున్నారు.

వార్డు	రికార్డుల్లో ఉన్న పేరు	శిలాఫలకంలో పేరు
2వ వార్డు	కె.లావణ్య	కె.నరేష్ లావణ్య
3వ వార్డు	ఎస్.లలితమ్మ	ఎస్.నాగభూషణ లలితమ్మ
5వ వార్డు	వై.సంధ్యావాణి	వై.మల్లిఖార్జున రెడ్డి సంధ్యావాణి
8వ వార్డు	ఎ.అస్మా తబస్సుం	ఎస్.మస్తాన్ అస్మా తబస్సుం
10వ వార్డు	జి.ఇస్మతారా బేగం	జి.కాలేషా ఇస్మతారా బేగం
15వ వార్డు	కె.సుకన్య	కె.పవన్ సుకన్య
18వ వార్డు	బుక్కే కళావతి	బుక్కే నాగరాజు కళావతి



పీలేరు పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన శిలాఫలకం

ములకలచెరువులో 144 సెక్షన్

- ఎంపీడీఓ కార్యాలయం దారులన్నీ బంద్
- పోలీసుల మోహరింపు
- ప్రశాంతంగా మండల సమావేశం



ఎంపీడీఓ కార్యాలయం వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

ములకలచెరువు, ఫిబ్రవరి 7 (ఆంధ్ర జ్యోతి): మండల సమావేశం సందర్భంగా ములకలచెరువు మొత్తం పోలీసుల ఆధీనంలోకి వెళ్లింది. ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్లే దారుల స్పాటులో పోలీసులు మొహరించారు. సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులను మాత్రమే అనుమతించారు. 144 సెక్షన్ విధించడం, భారీ బందోబస్తు నడుమ ఎట్టకేలకు మండల సమావేశం ప్రశాంతంగా ముగిసింది. వైసీపీ ప్రజాప్రతినిధులు ప్రజాస్వామ్య బద్ధంగా కాకుండా తమ నామినేషన్లు చించి ఏకగ్రీవం చేసుకున్నారని, వీరికి మండల సమావేశాలకు వచ్చే అర్హత లేదని ఆరోపిస్తూ మండల సమావేశాలు జరగకుండా టీడీపీ నేతలు, కార్యకర్తలు అడ్డుకుంటున్నారు. ఇలా రెండు సార్లు సమావేశాలు జరపాలని అధికారులు తేదీలు నిర్ణయించినా టీడీపీ నేతల నిరసనతో వాయిదా పడింది. జనవరి 2న తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో మండల సమావేశం వాయిదా పడిన విషయం విదితమే. ఓ వైపు టీడీపీ... మరో వైపు వైసీపీ శ్రేణులు భారీగా మొహరించడంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సభ్యులు సరైన సమయానికి రాలేదని మండల సమావేశాన్ని వాయిదా వేయడంతో వైసీపీ ప్రజాప్రతినిధులు ఎంపీడీఓ హరినారాయణపై దౌర్జన్యానికి పాల్పడి మినిట్స్ బుక్‌ను లాక్కుని నానా దుర్భాషలాడారు. దీనిపై ఎంపీడీఓ పోలీసులకు చేసిన ఫిర్యాదుపై కేసు కూడా నమోదైంది. ఈ క్రమంలో తిరిగి శుక్రవారం మండల సమావేశం నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. ఈ క్రమంలో ఇటీవల చిత్తూరు జడ్పీ సీఈఓ రవికుమార్ నాయుడు మండల సమావేశం సజావుగా జరిపేందుకు ములకలచెరువుకు వచ్చారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డితో సమావేశమై చర్చలు జరిపారు. మండల అభివృద్ధి కోసం సమావేశానికి ఐదుగురు కూటమి నేతలను ప్రత్యేక ఆహ్వానితులుగా అనుమతి ఇచ్చారు. ఈ క్రమంలో శుక్రవారం నిర్వహించిన మండల సమావేశం ప్రశాంతంగా జరిగింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీగా మోహరించి బందోబస్తు నిర్వహించారు. మదనపల్లె డీఎస్పీ కొండయ్యనాయుడు, సీఐ లక్ష్మన్న, ఎస్ఐలు నరసింహుడు, లోకేష్‌రెడ్డి, గాయత్రి బందోబస్తును పర్యవేక్షించారు. అనుకున్న సమయానికి ప్రారంభమైన మండల సమావేశం వివిధ శాఖల మీద చర్చలతో ముగిసింది. సమావేశానికి ఎనిమిది శాఖల అధికారులు డుమ్మా కొట్టారు. సమావేశంలో ఎంపీడీఓ హరినారాయణ, ఎంపీపీ సాయిలీల, జడ్పీటీసీ మోహన్‌రెడ్డి, కూటమి నేతలు ప్రసాద్‌రెడ్డి, నరసింహారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సుదర్శన్, జయరామ్‌రెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉర్దూ అకాడమీకి తూట్లు పొడిచిన వైసీపీ

- కూటమి పాలనతో రాష్ట్రంలో ప్రశాంతత
- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఎంఏ షరీఫ్



హార్సిలీహిల్స్‌లో మాట్లాడుతున్న శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్, తదితరులు

బి.కొత్తకోట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): తమ ఐదేళ్ల పాలనలో ఉర్దూ అకాడమీకి తూట్లు పొడిచి, ముస్లిం మైనారిటీల సంక్షేమాన్ని తుంగలో తొక్కిన పార్టీ వైసీపీ అని శాసనమండలి మాజీ చైర్మన్, రాష్ట్ర ప్రభుత్వ మైనార్టీ వెల్ఫేర్ సలహాదారు ఎంఏ షరీఫ్ విమర్శించారు. గురువారం కడప జిల్లా పర్యటన ముగించుకుని హార్సిలీహిల్స్‌కు చేరుకుని, గవర్నర్ బంగ్లాలో బస చేశారు. శుక్రవారం ఉదయం విలేఖరులతో ఆయన మాట్లాడుతూ ముస్లింల సంక్షేమానికి, విద్యాభివృద్ధికి, ఉర్దూ భాషా వికాసానికి సీఎం చంద్రబాబు కట్టుబడి ఉన్నారన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాదులోని గచ్చిబౌలిలో 250 ఎకరాల భూమిని కేటాయించి, అప్పటి ప్రధాని వాజ్‌పేయి సహకారంతో అబుల్‌కలాం ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీని నెలకొల్పిన ఘనత చంద్రబాబుదేనన్నారు. ఉర్దూ పాఠశాలలను ఎత్తేస్తున్నారని, ఉపాధ్యాయ పోస్టులను తగ్గించేస్తున్నారని వైసీపీ పత్రికలో వస్తున్న వార్తలను ఖండిస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 12 ఉర్దూ రెసిడెన్షియల్ స్కూల్ భవనాలు, హాస్టల్ భవనాలకు రూ.30 కోట్లు నిధులిచ్చామన్నారు. ఎంఎస్‌డీపీ కింద కడప, కదిరి, గుంతకల్లు, రాయచోటి తదితర ప్రాంతాల్లో జూనియర్ కళాశాల, హాస్టల్ భవనాలను నిర్మించబోతున్నట్లు ఆయన వెల్లడించారు. బి.కొత్తకోటలో రూ.50 లక్షలతో టీడీపీ హయాంలో నిర్మించిన షాదీ మహల్‌ను వైసీపీ నేతలు ఉద్దేశపూర్వకంగా ప్రారంభించలేదన్న సమాచారంపై ఆయన స్పందిస్తూ అవసరమైన నిధులు విడుదల చేస్తామన్నారు. అంతకు ముందు పలువురు మైనార్టీ నేతలు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ కార్య నిర్వాహక కార్యదర్శి పర్వీన్‌తాజ్, అయూబ్‌బాషా పాల్గొన్నారు.

బయో రీసోర్స్ సెంటర్ ఏర్పాటుకు కృషి

కలికిరి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): కలికిరిలోని కృషి విజ్ఞాన కేంద్రంలో బయో రీసోర్స్ సెంటర్ ఏర్పాటుకు కృషి చేస్తామని అగ్రికల్చర్ టెక్నాలజీ అప్లికేషన్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (అటారీ) జోన్-10(హైదరాబాద్) డైరెక్టర్ డాక్టర్ షేక్ ఎన్.మీరా ప్రకటించారు. కలికిరిలోని కృషి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం శాస్త్రీయ సలహా సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేరుశనగలో అడవి పందుల బెడద, ఉలవ పంట కోయడానికి హార్వెస్టర్, కొబ్బరిలో సమస్యలైన నల్లి, రుగోస్ ఫ్లై, మామిడిలో తేనె మంచుపురుగు, మిరపలో తామర పురుగులు నివారణ కోసం పరిశోధనలు ముమ్మరం చేయడానికి బయో రీసోర్స్ సెంటర్ ఉపయోగపడుతుందన్నారు. ఇదే అంశాల మీద ఆయన రైతులతో చర్చించి వారు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకున్నారు. వ్యవసాయంలో మిత్ర పురుగులు, ఆర్గానిక్ మందులు అందుబాటులోకి తేవాలని ఆయనను రైతులు కోరారు. అంతకు మునుపు కలికిరి కృషి విజ్ఞాన కేంద్రం డైరెక్టర్ డాక్టర్ కె.మంజుల 2024-25లో చేసిన వివిధ కార్యక్రమాలు, 2025-26లో చేపట్టబోయే కార్యక్రమాల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం (గుంటూరు) విస్తరణ సంచాలకులు డాక్టర్ శివనారాయణ, కలికిరి కేవీకే సహ సంచాలకుడు డాక్టర్ సుమతి, తిరుపతి వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ మహేశ్వరరెడ్డి, డాక్టర్ దేవకి, డాక్టర్ వసంత, 'రాస్' కేవీకే ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ శ్రీనివాస్, వేలూరు కేవీకే ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డా.తిరుమురుగన్, అన్నమయ్య జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి డాక్టర్ గుణశేఖర్, పీలేరు ఉద్యానశాఖాధికారి సుకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.



కలికిరిలో రైతులతో మాట్లాడుతున్న డాక్టర్ మీరా, తదితరులు

అంతరాయం లేని విద్యుత్ అందించాలి

- ఏపీ ట్రాన్స్‌కో ఎస్ఈ చంద్రశేఖరరెడ్డి

పీలేరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు అంతరాయం లేని విద్యుత్ సరఫరా అందజేయాలని ఏపీ ట్రాన్స్‌కో ఎస్ఈ చంద్రశేఖరరెడ్డి పీలేరు డివిజన్ విద్యుత్ సిబ్బందిని ఆదేశించారు. పీలేరులోని ట్రాన్స్‌కో ఈఈ కార్యాలయంలో శుక్రవారం డివిజన్ స్థాయి సమీక్షలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో లో-ఓల్టేజ్ సమస్యను అధిగమించేందుకు రెండు కొత్త సబ్-స్టేషన్లు మంజూరయ్యాయన్నారు. నాయనివారి పల్లె, వాల్మీకిపురం మండలం టి.సాకిరేవుపల్లె గ్రామాల్లో 33/11 కేవీ విద్యుత్ సబ్-స్టేషన్‌ల కోసం స్థలపరిశీలన కూడా పూర్తయ్యాయని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'సూర్య ఘర్' పథకంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. అనంతరం డివిజన్ పరిధిలో జరుగుతున్న కార్యకలాపాలను వాకబు చేశారు. పలు రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో ఈఈ చంద్రశేఖరరెడ్డి, ఏడీ అమీర్‌బాషా, జిల్లా అకౌంట్ ఆఫీసర్ బ్రహ్మయ్య ఆచారి, ఏఈలు ఖాదర్ ఇలాహీ, రామ్మూర్తి, వరప్రసాద్, ముజీబ్ పాల్గొన్నారు.

ముగిసిన ఫుట్‌బాల్ లీగ్ పోటీలు



మొదటి బహుమతిని అందజేస్తున్న సబ్‌కలెక్టర్

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా ఉన్నత పాఠశాలలో పది రోజులుగా జరుగుతున్న ఖేలో ఇండియా అస్మిత అండర్-17 బాలికల ఫుట్‌బాల్ లీగ్ పోటీలు శుక్రవారంతో ముగిశాయి. మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ మాట్లాడుతూ పట్టణంలో బాలికల విభాగంలో ఫుట్‌బాల్ పోటీలు చేయడం సంతోషంగా ఉందన్నారు. బాలికలు ఇలాంటి అవకాశాలు ఉపయోగించుకోవాలని కోరారు. ఈ రౌండ్ రాబిన్ డబుల్ లీగ్ పోటీల్లో ప్రథమ స్థానం శ్రీవేద స్కూల్ విద్యార్థులు, ద్వితీయ స్థానం వశిష్ఠ పాఠశాల విద్యార్థులు కైవసం చేసుకున్నారు. మొదటి, రెండోవ స్థానాలలో నిలిచిన పాఠశాలలకు రూ.50 వేలు, 30 వేలు చెక్కులను క్రీడాకారులకు అందించారు.

అధ్వానంగా.. ఐసీయూ

- కాలం చెల్లిన పరికరాలు,
- విరిగిపోయిన మంచాలు, చిరిగిపోయిన బెడ్లు
- అందుబాటులో లేని ఆక్సిజన్ సిలిండర్లు
- అటకెక్కిన సెంట్రల్ ఏసీ ● కరెంటు సరఫరా అంతంతే..
- ఇదీ ఘనత వహించిన రిమ్స్‌లో దుస్థితి

ఐసీయూ (ఇంటెన్సివ్ కేర్ యూనిట్) అంటే.. అత్యవసర విభాగం.. ఇక్కడ చేర్చే రోగులు తీవ్రస్థాయి అనారోగ్యంతో ఉంటారు. వీరికి సరైన సమయంలో సక్రమంగా వైద్యం అందించాల్సి ఉంటుంది. ఇక్కడ ఏ మాత్రం ఏమరపాటుగా ఉన్నా.. రోగులకు అందించే వైద్యంలో తేడా వచ్చినా క్షణాల్లో వారి ప్రాణాలు ఇట్టే గాలిలో కలిసి పోతాయి. అయి తే ఇంతటి ప్రాధాన్యత ఉన్న ఐసీయూ సరైన వైద్య సేవలు అందిం చలేక అరకొర వసతులతో ప్రాణాపాయ స్థితిలో కొట్టు మిట్టాడు తోంది. ఇది ఎక్కడో మారుమూల ఆసుపత్రిలో కాదు. ఇది ఘనత వహించిన ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో నెలకొన్న దుస్థితి.



కడప సెవెన్ రోడ్స్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కడప నగర పరిధిలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో దాదాపు 900 పడకలతో రోగులకు వైద్యసేవలను అందిస్తున్నారు. ప్రతిరోజు సుమారు 1200 నుంచి 1500 వరకు ఓపీ కొనసాగుతోంది. వైద్యం కోసం వచ్చే రోగల సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. అయితే ఆసుపత్రి ప్రారంభంలో ఐసీయూ 20+20 పడకలతో మొదలు కాగా.. ఇప్పటికీ అలాగే కొనసాగుతోంది. అవే పరికరాలు, పాడై పోయిన బెడ్లపై అరకొర వసతులతో వైద్యం అందిస్తూ కాలం గడుపుతున్నారు.

అరకొర వసతులతో వైద్య సేవలు

ఐసీయూలో పూర్తిస్థాయి వైద్య పరికరాలతో పాటు ఆక్సిజన్ తప్పక అందుబాటులో ఉండాలి. ఇక వెంటిలేటర్ మిషన్లలో కొన్ని రకాల పరికరాల పని సామర్థ్యానికి ఎయిర్ కండిషన్ కూడా చాలా కీలకం. అయితే ప్రభుత్వ సరస్వజన ఆసుపత్రిలో సెంట్రల్ ఎయిర్ కండీషన్ సిస్టం పనిచేయడం లేదు. ప్రత్యామ్నయంగా రూంలో వాడే ఐసీలు, టేబుల్ ఫ్యాన్‌లతో వైద్య సేవలను అందిస్తున్నారు. సెంట్రల్ ఏసీ కాస్త అటకెక్కింది. కరెంటు సరఫరా సైతం ఐసీయూలో ఇబ్బంది పెడుతూనే ఉంటుంది. ఇక కాలం చెల్లిన, విరిగిన మంచాలపైన వైద్య సేవలను అందిస్తున్నారు. సెంట్రల్ ఆక్సిజన్ సరఫరా అందుబాటులో ఉన్నప్పటికి గేజ్ మిషన్లు పనితీరు అంతంత మాత్రమే. ఆక్సిజన్ లీకేజీల వల్ల ఏదైనా అగ్నిప్రమాదం సంభవిస్తే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుంది.



పరదాలు లేని ఐసీయూలో వైద్య సేవలు



విరిగిన మంచానికి కట్లు



ఆక్సిజన్ అందించే గేజ్ మిషన్ల పరిస్థితి



ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం

ఆసుపత్రిలో కొన్ని సౌకర్యాల కల్పనకు, బెడ్ల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. సెంట్రల్ ఏసీ మరమ్మత్తులు వచ్చినపుడు రోగులకు ఇబ్బంది లేకుండా ఏసీ మిషన్లు, ఫ్యాన్లు అమర్చాం. ప్రభుత్వానికి పంపిన ప్రతిపాదనలు ఆమోదం పొందితే మరింత మెరుగ్గా రోగులకు సౌకర్యాలు అందిస్తాం. ఐసీయూను నిరంతరం పర్యవేక్షిస్తుంటాం. రోగులకు ఇబ్బంది లేకుండా చూస్తున్నాం.

-డాక్టర్ శ్రీనివాసులు సీఎస్ఆర్ఎంఓ, సర్వజన ఆసుపత్రి, కడప

రోగుల అవస్థలు వర్ణనాతీతం

ఐసీయూలో కిటికీలకు పరదాలు కరువయ్యాయి. బెడ్డు మీద వైద్యం చేయించుకుంటున్న రోగులు బాహాటంగా అందరికి కనిపిస్తున్నారు. ముఖ్యంగా మహిళా రోగులు ఉన్న బెడ్ల వద్ద ఉన్న కిటికీలకు కూడా కర్టెన్లు లేకపోవడంతో వైద్యం పొందే సమయంలో తీవ్ర అసౌకర్యానికి గురవతున్నారు. కొన్నిచోట్ల కిటికీలకు అడ్డంగా అట్టలను ఉంచి కవర్ చేస్తున్నారు. రోగులు బాత్‌రూం వెళ్లేందుకు వీల్‌చెయిర్‌ల కోసం గంటల తరబడి వేచి చూ డాల్సిన పరిస్థితి. ఇప్పటికైనా జిల్లా అధికారులు చర్యలు చేప ట్టి అత్యవసర వైద్య సేవల విభాగాల్లో అన్ని వసతులు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

హుండీల లెక్కింపుతో గండికి రూ. 17లక్షల ఆదాయం



గండి క్షేత్రంలో హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

చక్రాయపేట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): గండి వీరాంజనేయస్వామి దేవస్థానంలో శుక్రవారం సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో హుండీల లెక్కింపు కార్యక్రమం జరిగింది. ఈ హుండీల లెక్కింపుతో రూ.17,00,750 ఆదాయం వచ్చింది. అలాగే నిత్య అన్నదాన ప్రసాదం హుండీ ద్వారా రూ.30 వేలు, నాలుగు గ్రాముల బంగారు, 320 గ్రాముల వెండి, రెండు డాలర్లు వచ్చాయి. 80 రోజుల హుండీల లెక్కింపు శుక్రవారం జరిగింది. జిల్లా దేవదాయశాఖ జూనియర్ అసిస్టెంట్ భారతి, ప్రధాన అర్చకులు కేసరి, ఉప ప్రధాన అర్చకులు రాజారమేష్, దేవస్థాన చైర్మన్ కావలి కృష్ణతేజ, మాజీచైర్మన్ వెంకటస్వామి, ఏపీజీబీ మేనేజర్ భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండోలో మెరిసిన ముత్యాలు

- రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ



పతకాలు సాధించిన చిన్నారులు

ప్రొద్దుటూరు రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో జరిగిన ఎన్టీఆర్ మెమోరియల్ తైక్వాండో చాంపియన్ షిప్-2025 పోటీల్లో కడప జిల్లా విద్యార్థులు పతకాల పంట పండించారు. జనవరి 30 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు జరిగిన తైక్వాండో రాష్ట్రస్థాయి పోటీల్లో అద్భుత ప్రదర్శనతో మొత్తం 17 పతకాలు సాధించి ఓవరాల్ రన్నరప్‌గా నిలిచి ప్రతిభను చాటారు. ఈ పోటీల్లో మొత్తం 9 స్వర్ణ పతకాలు, 4 రజిత, 4 కాంస్య పత కాలు సాధిం చినట్లు కోచ్‌లు కమాల్, రాజేష్‌లు తెలిపారు. మహిత, సత్య భామ, ఏస్వరి, హోషిక, కీర్తన, విజయసుందరరాజు, దినేష్, హేమ, తనిష్‌లు స్వర్ణపతకాలు సాధించగా, వెంటక మోక్షిత, నిహాల్, తేజస్వీ, త్రివేణిలు కాంస్య పతకాలను, మహర్నిష్, యోగి విశ్వనాథరెడ్డి, భరత్, ఫరియాలు రజిత పతకాలను సాధించినట్లు వివరించారు.

మన మిత్ర ద్వారా హాల్ టికెట్లు

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు సంబంధించి సెకండియర్ ఎంపీసీ, బైపీసీ చదువుతున్న విద్యార్థులు ప్రాక్టికల్ హాల్ టికెట్స్‌ను కాలేజ్ లాగిన్ పబ్లిక్ డొమైన్ హెచ్‌టీటీపీఎస్://బీఐఈ.ఏపీ.జీఓవీ.ఇన్‌లో అందుబాటులో ఉన్నట్లు ఆర్ఐఓ వెంకటసుబ్బయ్య తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన మనమిత్ర (వాట్సప్ గవర్నెన్స్) ద్వారా 9552300009 అనే నెంబర్‌కు హాయ్ అనే మెసేజ్ పంపించి.. అందులో ఎడ్యుకేషన్ సర్వీసెస్ ఆప్షన్ ఉపయోగించి ప్రీవియస్ హాల్ టికెట్ నెంబర్ లేదా ఆధార్ నెంబర్, పుట్టిన తేదీలను ఎంటర్ చేసి హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో ఇటుకల బట్టీ కార్మికుడి మృతి



ఆసుపత్రిలో స్ట్రెచర్‌పై ఉన్న బ్రహ్మం మృతదేహం

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మండలం రామేశ్వరంలోని ఇటుకల బట్టీలో పనిచేసే బ్రహ్మం (30) అనే కార్మికుడు శుక్రవారం అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. బ్రహ్మం తల్లి సంధ్యావతి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.... దొరసానిపల్లెలో నివాసముంటున్న సంధ్యావతి, శివశంకర్‌లకు ముగ్గురు సంతానం. పెద్ద కుమారుడైన బ్రహ్మం గత ఐదేళ్లుగా రామేశ్వరంలోని నలగట్ల శ్రీనివాసులరెడ్డి అలియాస్ బెంగుళూరు శ్రీనుకు చెందిన సిమెంటు ఇటుకల ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. సూమారు రెండేళ్ల క్రితం బ్రహ్మం నాగలక్ష్మి అనే ముగ్గురు పిల్లలు గల వివాహితను ప్రేమ వివాహం చేసుకున్నాడు. అదే ఇటుకల బట్టీలో యజమాని శ్రీనివాసులరెడ్డి ఇచ్చిన రేకుల గదిలో నివాసముంటున్నారు. వివాహం చేసుకున్నప్పటి నుంచి బ్రహ్మం తల్లిదండ్రుల వద్దకు వెళ్లలేదు. వివాహం అయిన రెండు రోజు లకు తల్లిదండ్రులు వెళ్లి కుమారుడితో మాట్లాడటానికి ప్రయ త్నించగా బట్టి యజమాని మీ కుమారుడు వివాహం చేసుకొని మా బట్టిలోనే బతుకుతున్నాడు. అతడి బాధ్యత నాదేనని.. తల్లిదండ్రులకు చెప్పి పంపించాడు. అయితే శుక్రవారం ఉదయం 10.30 గంటలకు మీ కొడుకు ఫ్యానుకు ఉరి వేసుకున్నాడని తల్లిదండ్రులకు శ్రీనివాసులరెడ్డి ఫోన్ చేశాడు. అప్పటికే మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడకు తల్లిదండ్రులు వెళ్లి చూడగా బ్రహ్మం విగత జీవిగా స్ట్రెచర్ మీద వున్నాడు. ఇటుకల బట్టీలో ఉరి వేసుకుంటే పోలీసులకు ఫోన్ చేయకుండా నేరుగా జిల్లా ఆసుపత్రికి ఎందుకు తీసుకొచ్చారని బ్రహ్మం తల్లి సంధ్యావతి ప్రశ్నించారు. బ్రహ్మం మృతికి అతని భార్య నాగలక్ష్మి, ఇటుకల బట్టి యజయానిపై అనుమానం ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. మృతదేహంపై ఉరివేసుకున్నట్లు గొంతుపై ఎలాంటి ఆనవాళ్లు కనిపించలేదని.. పోలీసులు తమ కుమారుడి మరణంపై పూర్తిస్థాయిలో విచారించి చర్యలు తీసుకోవాలని కోరారు.

బంగారు గొలుసు అపహరణ



బాధితురాలి నుంచి వివరాలు సేకరిస్తున్న సీఐ, ఎస్ఐ

వల్లూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఆదినిమ్మాయపల్లె డ్యాంకు వెళ్లే రహదారిలో కొత్తపల్లె చెరువు వద్ద శుక్రవారం ఉదయం మహిళమెడలోని గొలుసును దుండగుడు లాక్కెళ్లినట్లు వల్లూరు సీఐ రోషన్ తెలిపారు. సి.కొత్తపల్లెకు చెందిన కాంతమ్మ తన పశువులను చెరువు వద్ద మేపుకుంటుండగా దుండగుడు ద్విచక్రవాహనంపై వచ్చి లాక్కెళ్లినట్లు వెల్లడించారు. రెప్పపాటులో జరిగిన ఆ సంఘటన చూసి బిత్తర పోయిన కాంతమ్మ కేకలు వేయగా అగంతకుడు తన ద్విచక్రవాహనంలో ఆదినిమ్మాయపల్లె వైపు వెళ్లిపాయాడు. ఈమేరకు ఆమె తన బంధువులను స్టేషన్‌కు రావడంతో అక్కడున్న పోలీసులు దుండగుడి కోసం ఆరా తీస్తున్నారు. ఈ విషయం తన దృష్టికి రావడంతో ఇన్‌చార్జ్ ఎస్.ఐ. ప్రతాప్‌రెడ్డితో కలిసి సంఘటనా స్థలికి వెళ్లి పరిశీలించామన్నారు. సిబ్బందిని అప్రమత్తం చేసి అన్ని రూట్లకు పంపించినట్లు తెలిపారు. కాగా దుండగుడి వివరాలను ఎర్రపల్సర్ బండి, ఎరుపు రంగు టీ.షర్టు, మూతికి మాస్క్ ధరించారని బాధితురాలు తెలిపారు. కేసును దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రోషన్ వెల్లడించారు.

మామపై అల్లుడు దాడి

కడప(క్రైం), ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కడప నగరం భగత్ సింగ్‌నగర్‌లో శుక్రవారం మామపై అల్లుడు దాడి చేసినట్లు తాలుకా ఎస్ఐ తాహీర్ హుస్సేన్ తెలిపారు. పఠాన్ మగ్బూల్ బాష, అతడి అల్లుడు షారుక్‌ఖాన్‌ల మధ్య కుటుంబ తగదాలు నెలకొన్నాయి. దీంతో అల్లుడు మామను దాడి చేసి గాయపరిచినట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

పీఎఫ్ ఖాతాను ఆన్‌లైన్ చేయాలి

- జడ్పీ సీఈఓకు యూటీఎఫ్ వినతి



సీఈఓ ఓబుళమ్మకు వినతిపత్రం సమర్పిస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలకు సంబంధించి 2023-24, 2024-25 వార్షిక జమలను వెంటనే ఆన్‌లైన్ చేయాలని యూటీఎఫ్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో ముఖ్య కార్య నిర్వహణ అధికారి సి.ఓబుళమ్మను కలిసి యూటీఎఫ్ జిల్లా శాఖ పక్షాన వినతిపత్రం సమర్పించారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్‌బాబులు మాట్లాడుతూ జిల్లాలోని మండల పరిషత్, జిల్లా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయులు తమ జీతభత్యాల నుంచి కొంత సొమ్మును ప్రతినెల ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలకు పొదుపు కింద జమచేస్తున్నారన్నారు. 2022-23 వరకు మాత్రమే ఆన్‌లైన్ చేశారని, ఇప్పటి వరకు ఆన్‌లైన్ చేయలేదన్నారు. కావున చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వై.రవికుమార్, కె.రసింహరావు, రూతు ఆరోగ్యమేరీ, చంద్రశేఖర్, గోపీనాథ్, మేరీ ప్రసన్న, రామకేశవ, వీరనారాయణ ఉన్నారు.

ఘనంగా ఉరుసు మహోత్సవాలు



వాల్మీకిపురం ఉరుసు ఉత్సవాలకు హాజరైన మైనార్టీ వ్యవహారాల ప్రభుత్వ సలహాదారుడు ఎంఏ షరీఫ్

వాల్మీకిపురం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): హసన్‌ఖాన్ వీధిలో జూట హజ్రత్‌ఖ్వాజా పీర్ మస్తాన్‌వలి దర్గాలో శుక్రవారం ఉరుసు మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. సాయంత్రం దర్గాలో గంధం, ముషాయిరా నిర్వహించారు. మరో రెండు రోజులు ఉరుసు, ఖవ్వాలి, తహలీల్‌ఫాతేహా జరగనున్నాయి. తొలిరోజు ఉరుసు మహోత్స వాల్లో రాష్ట్ర మైనార్టీ వ్యవహారాల ప్రభుత్వ సలహాదారుడు ఎంఏ షరీఫ్, ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి చాదర్ సమర్పించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్ర మంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కంభం నిరంజన్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, ఉపాధ్యక్షుడు బొక్కసం రామకృష్ణ, నాయకులు పీవీ నారాయణ, చంద్రమౌళి, మురళి, కువైట్ సయ్యద్‌బాషా, డిష్ బ్రదర్స్ దర్గా కమిటీ అధ్యక్షు డు సయ్యద్ బాషా, మైనార్టీ నేతలు, మతపెద్దలు, యువత పాల్గొన్నారు.

సన్నబియ్యం అందిస్తే హాజరు పెరుగుదల

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన పథకంలో సన్నబియ్యంతో కూడిన పౌష్టికాహారాన్ని అందించడం వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో హాజరుశాతం పెరుగుతుందని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి ప్రకటనలో పేర్కొన్నారు. మధ్యాహ్న భోజన పథకంతో పాటు సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు సన్నబియ్యాన్ని అందించాలని మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకోవడం హర్షణీయమన్నారు.

విద్యార్థుల హాజరుశాతం పెంచడంతో పాటు విద్యాభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు సహేతుకంగా ఉన్నాయన్నారు. వీటితో పాటు విద్యా వ్యవస్థకు అడ్డంకిగా మారిన 117 జీఓను సమూలంగా రద్దు చేసి విద్యార్థి, ఉపాధ్యాయ నిష్పత్తిని కూడా తగ్గించి ఒక్క ఉపాధ్యాయ పోస్టు కూడా పోకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

హోటళ్లపై విజిలెన్స్ దాడులు

- 15 సిలిండర్లు స్వాధీనం



పట్టుబడిన గ్యాస్ సిలిండర్లతో విజిలెన్స్ అధికారులు

కడప(క్రైం)ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కమాలాపురం, ఎర్రగుంట్ల ప్రాంతాలలో శుక్రవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించి 15 సిలిండర్లను సీజ్ చేసినట్లు డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ గీతావాణి తెలిపారు. గృహాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్లను హోటళ్లకు వినియోగిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడులు చేశామని తెలిపారు. వంట గ్యాస్‌ను వాణిజ్య కార్యకలపాలకు వినియోగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

క్రమశిక్షణ, పట్టుదలతో చదవాలి

వేంపల్లె, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణ, పట్టుదలతో చదివితే ఎలాంటి పరీక్షలోనైనా విజయం సాధ్యమవుతుందని బాంబే ఐఐటీలో చదివిన అయ్యపుపని వంశీనాథ్ తెలిపారు. సాఫ్ట్‌వేర్ కంపెనీలో కోటి రూపాయల ఉద్యోగాన్ని వదులుకొని యూపీఎస్సీ ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షకు ప్రిపేర్ అవుతున్న వంశీనాథ్ ట్రిపుల్‌ఐటీ విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్త ఇక్కడి విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందని, తన కుమారుడు వంశీనాథ్‌తో విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు ఇప్పించారు. ఈ సందర్భంగా వంశీనాథ్ మాట్లాడుతూ ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు నిరంతరం శ్రమించాలన్నారు. కార్యక్రమంలో ట్రిపుల్‌ఐటీ అకడమిక్ డీన్, సీఎస్ఈ హెచ్ఓడీ రత్నకుమారి, ఏఓ రవికుమార్, డీన్ రమేష్, ప్లేస్‌మెంట్ అధికారి సుందర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఉద్యాన విద్యార్థుల సాంస్కృతిక, క్రీడా పోటీలు

- ఓవరాల్ చాంపియన్‌గా అనంతరాజుపేట కళాశాల



ఓవరావల్ చాంపియన్ సాధించిన విద్యార్థులు

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతరాజు పేట ఉద్యాన కళాశాల ఆవరణలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న ఉద్యాన అంతర కళాశాలల రాష్ట్ర స్థాయి సాంస్కృతిక, క్రీడా పో టీలు శుక్రవారం ముగిశాయి. ఈ పోటీల్లో 9 కళాశాలలకు చెందిన 450 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పోటీల్లో నువ్వా నేనా అన్నట్లుగా విద్యార్థులు పోటీ పడి అన్ని క్రీడులు ఆడారు. హోరాహోరీగా సాగిన పోటీల్లో అనంతరాజుపేట ఉద్యాన విద్యార్థులు అన్ని అంశాల్లో అదరగొట్టారు. సాంస్కృతిక, సాహిత్య, క్రీడా పోటీల్లో ఓవరాల్ చాంపి యన్‌గా నిలిచారు. విజేతలకు ఉద్యాన యూనివర్శిటీ ఉపకులపతి కే.గోపాల్ బహుమతులు అందించి అభినందించారు. అనంతరాజుపేట కళాశాల ఉద్యో గులు, అధ్యాపకులను అభినందించారు. ముగింపు కార్యక్రమంలో డీఎస్ఏ డాక్టర్ సూర్యకుమారి, డీఈ గోవిందరాజులు, అసోసియేట్ డీన్ పీటీ శ్రీనివాస్, ఓఎస్ఏ డాక్టర్ సయ్యద్ సదరుస్సీసాలు ప్రసంగించారు. అనంతరం ఉపకులపతి గోపాల్‌ను ఘనంగా సన్మానించారు.

అవగాహన కల్పిస్తాం.. పాటించండి

● డీఎస్పీ మురళీనాయక్, ఎంవీఐ ప్రసాద్



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎస్పీ మురళీనాయక్

పులివెందుల రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారించేందుకు ప్రజలంతా చైతన్యవంతులయ్యేందుకు అవగాహన కల్పిస్తాం పాటించాలంటూ పులివెందుల డీఎస్పీ మురళీనాయక్, ఎంవీఐ ప్రసాద్‌లు పేర్కొన్నారు. జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల సందర్భంగా శుక్రవారం స్థానిక అర్బన్ పోలీస్ స్టేషన్ వద్ద డీఎస్పీ జెండా ఊపి బైక్ ర్యాలీ ప్రారంభించారు. పోలీస్‌స్టేషన్ నుంచి గరండాల్ బ్రిడ్జి సర్కిల్, పూలంగళ్ల వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ డీఎస్పీ, ఎంవీఐలు మాట్లాడుతూ ప్రతి ఒక్కరురోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. ముఖ్యంగా హెల్మెట్ లేకపోవడం వలన కలిగే నష్టాలను వివరించారు. మీరు ప్రమాదంలో పడిపోవడమే కాకుండా మీ కుటుంబాన్ని ప్రమాదంలో నెట్టేస్తారన్నారు. అందుకే ప్రతి ద్విచక్రవాహనదారుడు తప్పకుండా హెల్మెట్ వాడాలన్నారు. నాలుగు చక్రాల వాహనదారులు సీట్‌బెల్టు ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐలు నరసింహులు, రమణ, ఆర్టీసీ డీఎం రామకృష్ణ, ఎస్ఐలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


కొరవడిన ఆదరణ..అంతరించిపోతున్న మల్బరీ



అంజనేయపురంలో నిరుపయోగంగా ఉన్న పట్టుగూళ్ల పెంపకం షెడ్డు...ఎర్రబొమ్మనపల్లెలో సాగు చేసిన మల్బరీ

చక్రాయపేట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఒకనాడు చక్రాయపేట మండలంలో వందలాది ఎకరాలు మల్బరీ తోటలు సాగుచేసేవారు. అది నానాటికీ ఆదరణ కొరవడడంతో అంతరించిపోతోంది. గతంలో మల్బరీతోటల పెంపకం అంటే ఎంతో ఆతృతగా సాగుచేసేవారు. మండలంలోని సురభి, కొండప్పగారిపల్లె, ఎర్రబొమ్మనపల్లె, కల్లూరుపల్లె, నెర్సుపల్లె, చిలేకాంపల్లె తదితర ప్రాంతాలలో విరివిగా సాగుచేసేవారు. అలాంటిది ఒకవైపు ఆదరణ తగ్గడం, మరోవైపు దిగుబడి రాకపోవడం, గిట్టుబాటు ధరలు లేకపోవడం, దీనికితోడు వాతావరణం సహకరించకపోవడంతో నేడు కేవలం ఒకటి రెండు ఎకరాలకే పరిమితమైంది. దీంతో ఈ పంట కనుచూపు మేర కనిపించడం లేదు. ప్రభుత్వమేమో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. ఇక పట్టుగూళ్ల విషయానికి వస్తే నూరు గుడ్లు తెస్తే నూరు కేజీలు అవుతుందని ప్రభుత్వం ఓ వైపు చెబుతున్నా రైతులు మాత్రం నూరు గుడ్లకు 35 నుంచి 45కేజీల దిగుబడి వస్తుందని కేజీ రూ.400 నుంచి రూ.600 పలుకుతుందని అంటున్నారు. అయితే ఖర్చులు అధికంగా వస్తున్నాయని, గిట్టుబాటు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సున్నం, బ్లీచింగ్, విజేత పౌడర్, పేపర్‌లతో పాటు వందగుడ్లకు రూ.5 వేలు, స్టాండ్లు, తట్టలు ఇలాంటి వాటికన్నింటికీ ఖర్చు ఎక్కువ అవుతోందని, దీంతో సాగుకు మొగ్గుచూపం లేదని అంటున్నారు. అయితే ప్రభుత్వ అధికారులు మాత్రం షెడ్డుకు, స్టాండుకు, పురుగులకు ఇలా అన్నింటికీ సబ్సిడీలు ఇస్తున్నా రైతులు ముందుకు రావడం లేదని పేర్కొంటున్నారు. దీనికి వాతావరణం సహకరించకపోవడం, ధరలు తగ్గడం ఇలా ఎన్నో కారణాలు ఉన్నాయి. చిన్న షెడ్డు వేసుకున్నా రూ.3లక్షలు సబ్సిడీ ఇస్తామని ప్రభుత్వం చెబుతోంది. కానీ షెడ్డుకు రూ.6లక్షలు అవుతుందని రైతులు చెబుతున్నారు. స్టాండుకు, పట్టలకు సబ్సిడీ అంటున్నారు తప్ప సబ్సిడీ మాత్రం రాలేదని అంటున్నారు. ఎకరా ఆకు పెంచితే రూ.25వేలు సబ్సిడీ ఇస్తారని, అది కూడా ఇంత వరకు రాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుడ్లు కావాలంటే మైదుకూరు, వనిపెంట, హిందూపురం, కదిరి, బాగేపల్లె, బెంగుళూరు నుంచి కూడా తెచ్చుకుంటామని, కానీ అమ్ముకునేందుకు కష్టమవుతోందని పలువురు పేర్కొంటున్నారు.

చాలా కాలంగా సబ్సిడీ రావడం లేదు



మల్బరీ సాగుచేస్తే అన్నీ సబ్సిడీనే అంటారు. కానీ సబ్సిడీ మాత్రం రావడం లేదు. నేను షెడ్డు కట్టుకున్నాను. ప్రభుత్వం తరపున సగం సబ్సిడీ అన్నారు, కానీ రూ.1.80 లక్షలు ఇచ్చారు. నాకు రూ.6లక్షలు ఖర్చు అయింది. మిగతాది ఇస్తామంటున్నారు. కానీ ఇప్పటివరకు రాలేదు. డబ్బు అయితే కట్టించుకుంటారు మళ్లీ పలికేనాథుడు ఉండడు.

- శివారెడ్డి, గంగారపువాండ్లపల్లె, చక్రాయపేట

'ఏపీజీబీ కార్యాలయం కడపలోనే ఉండాలి'

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఏపీజీబీ ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించాలని రాయలసీమ అభివృద్ధి వేదిక కన్వీనర్ డాక్టర్ సి.ఓబుల్‌రెడ్డి యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా డిమాండ్ చేశారు. శుక్రవారం కడప నగరం శ్రీహాస్పిటల్‌లో అన్నీ అమరావతికేనా అన్న పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ ఇక్కడి ప్రధాన కార్యాలయాన్ని అమరావతికి తరలించాలనే ప్రయత్నం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఇది పాలకవర్గ పార్టీలకు రాయలసీమ పట్ల ఉన్న వివక్షకు నిదర్శనమన్నారు. రాయలసీమ ప్రజలు రాజకీయాలకు అతీతంగా ఏపీజీబీ ప్రధాన కార్యాలయాన్ని విలీనం తర్వాత కూడా కడపలోనే కొనసాగించాలన్నారు. ఇప్పటికే లోకాయుక్త, ఎంఎస్ఎంఈ ట్రైనింగ్ సెంటర్‌ను, న్యాయ విశ్వవిద్యాలయాన్ని, హైకోర్టును, నార్కోటటిక్స్ కోర్టులను రాయలసీమకు లేకుండా చేశారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం, సాంప్రదాయం ప్రకారం కడపలోనే ఏపీజీబీ హెడ్ క్వార్టర్‌ను కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ అభివృద్ధి వేదిక నాయకులు ప్రవీణ్, లోహిత్ మనోజ్, రవి తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ మందును వేసుకోవాలి

వేంపల్లె, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): నులిపురుగు మందును పిల్లలతో పాటు పెద్దలు కూడా వేసుకోవాలని, ఎంపీడీఓ కళాయమ్మ, డాక్టర్ స్వాతిసాయి, హెచ్‌ఈ షఫీఉన్నీసా తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా గోడపత్రాలు విడుదల చేశారు. 10వ తేదీన ప్రతి ఒక్కరు నులిపురుగు మాత్రలు వేసుకోవాలని తెలిపారు. పిల్లలకు అందించేందుకు ఆయా పాఠశాలలకు మాత్రలు పంపినట్లు తెలిపారు. వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో పలు ప్రయోజనాలు



ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన పంటను పరిశీలిస్తున్న సీఈఓ

పెండ్లిమర్రి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజోతి): ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని రైతు సాధికారిక సంస్థ సీఈఓ రామారావు తెలిపారు. మండలంలోని పగడాలపల్లె ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతు గంగిరెడ్డి పొలాన్ని శుక్రవారం జిల్లా ప్రాజెక్టు మేనేజరు ప్రవీణతో కలిసి సీఈఓ పరిశీలించారు. ఈ సందర్భంగా గంగిరెడ్డి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా పండించిన చామంతి పుష్పాలు అధిక నాణ్యతతో పాటు మంచి దిగుబడి వచ్చిందన్నారు. సీఈఓ మాట్లాడుతూ రైతు గంగిరెడ్డి అనుసరిస్తున్న ప్రకృతి వ్యవసాయ పద్ధతులను రైతులందరూ అనుసరించేలా ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాలపై సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

పెండ్లిమర్రి, ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలపై శుక్రవాకం పొలతల క్షేత్రంలో ఈవో కృష్ణా నాయక్ అధ్యక్షతన మండల సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు ఉండాలనే విషయమై చర్చించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ అనురాధ, ఎంపీడీవో జగన్‌మోహన్ రెడ్డి, ఎస్ఐ మధుసూదన్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

'ఒక వ్యక్తి సమస్యను కుల సమస్యగా చిత్రీకరించడం దుర్మార్గం'

కడప ఎర్రముక్కపల్లె, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఒక వ్యక్తి సమస్యను ఎస్సీ కులాల సమస్యగా చిత్రీకరించడం దుర్మార్గమని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాసాపేట శివ, జనసేన నాయకుడు తుంగా రమణయ్య, గజ్జల సాయి ఆరోపించారు. కడపలోని మాసాపేట టీడీపీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. వీధి సమస్యగా చెబుతూ కులాల ప్రస్తావన తెస్తూ కూటమి దళిత కులాల వ్యతిరేకి అన్నట్లు మాట్లాడారన్నారు. ప్రభుత్వ స్థలాన్ని ప్రభుత్వానికి అప్పగించాలని కోరారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీలపై దాడులు పెరిగాయి

● దళితఫోరం కన్వీనర్ బూసిపాటి కిశోర్

కడప ఎర్రముక్కపల్లె, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ బీసీలపై దాడులు పెరిగాయని దళితఫోరం కన్వీనర్ బూసిపాటి కిశోర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై జాతీయ ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. శుక్రవారం నగరంలోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ మాసాపేటలో అధికారులను అడ్డం పెట్టుకని అధికార పార్టీ నేతలు వాటర్ ప్లాంట్ కూల్చివేతయత్నం కూడా ఇందులో భాగమేనన్నారు.

సూపర్ స్పెషాలిటీ వైద్యశాలలో ఉద్యోగాలను భర్తీ చేయాలి



రిమ్స్ పరిపాలన అధికారికి వినతిపత్రం సమర్పిస్తున్న ఏఐటీయూసీ సభ్యులు

కడప సెవెన్ రోడ్స్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కడప రిమ్స్ ప్రాంగణంలో గల ప్రభుత్వ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిలో వైద్యులు, తదితర పోస్టులను సత్వరమే చేపట్టేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని శుక్రవారం రిమ్స్ సూపర్ స్పెషాలిటీ పరిపాలన అధికారి రంగస్వామికి ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా, యూనియన్ నాయకులు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏపీ న్యూ సైంటిఫిక్ శానిటేషన్ పాలసీ 2015 కింద ఉన్న సెక్యూరిటీ పెస్ట్ కంట్రోల్ సిబ్బందికి సమానంగా రూ.16 వేలు వేతనం అమలు చేయాలని కోరారు. సెక్యూరిటీ, శానిటేషన్ సిబ్బందికి సంవత్సరానికి రెండు జతలు యూనిఫాం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పుల ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించి కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, ప్రభుత్వ ఆసుపత్రిల లో ప్రభుత్వం విడుదల చేసిన జీఓ నెంబర్ 549 ప్రకారం వేతనాలు చెల్లించి పీఎఫ్, ఈఎస్ఐ సక్రమంగా అమలు అయ్యేటట్లు చూడాలని కోరారు.

నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న ఏపీఎం ఆంజనేయులు

వేముల, ఫిబ్రవరి 7 (ఆంధ్ర జ్యోతి): కమ్యూనిటీ బేస్డ్ ఆర్గనైజేషన్స్‌లో డ్వాక్రా లీడర్లు, గ్రామ సమాఖ్య పదాధికారులు, మండల మహిళా సమాఖ్య పదాధికారులు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని ఏపీఎం ఆంజనేయులు అన్నారు. శుక్రవారం వేములలోని స్త్రీశక్తి భవన్‌లో మండల మహిళా సమాఖ్య కార్యవర్గ సభ్యులకు, గ్రామ సమాఖ్య అసిస్టెంట్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఏపీఎం మాట్లాడుతూ డ్వాక్రా సభ్యుల అభివృద్ధికి సంక్షేమానికి కృషిచేసే మహిళా సభ్యులని లీడర్లుగా ఎంపిక చేసుకోవడం ద్వారా మెరుగైన ఫలితాలు పొందవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటటీ కోఆర్డినేటర్లు జైపాల్, జ్యోతి, నాగేశ్వరి, గంగరాజు, చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'నాగన్న మృతి విశ్వవిద్యాలయానికి తీరని లోటు'



నాగన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైవీయూ అధికారుల బృందం

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): యోగి వేమన విశ్వవిద్యాలయం పీజీ కళాశాల మహిళా వసతి గృహ టైం స్కేల్ ఉద్యోగి ఎస్.నాగన్న అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందారు. నాగన్న స్వగ్రామమైన మల్లాయపల్లెకు వైవీయూ వీసీ ఆచార్య కె.కృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రఘునాథరెడ్డి, సీఈ కృష్ణారావు వెళ్లి నాగన్న మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ఓదార్పు తెలిపారు. అనంతరం వైవీయూ పరిపాలన భవనం ప్రాంగణంలో సంతాప సభ నిర్వహించారు.

గుండెపోటుకు ప్రభుత్వ వైద్యశాలలో ప్రాథమిక చికిత్స



వేంపల్లె: మాట్లాడుతున్న అనస్థీషియా డాక్టర్ రజిత... చెన్నూరు: మాట్లాడుతున్న సీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ హరీశ్

వేంపల్లె, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): గుండెపోటుకు గురైన వారికి ప్రాణం పోకుండా ప్రాథమిక చికిత్స చేసి అవసరమైతే ఇంజక్షన్ వేసే సదుపాయం వేంపల్లె ప్రభుత్వ వైద్యశాలలో ఉందని డాక్టర్ శేఖర్, బాలగురప్ప, అనస్థీషియా డాక్టర్ రజిత తెలిపారు. శుక్రవారం గుండెపోటుకు గురైన వారికి అందించే చికిత్సలపై వేంపల్లె (సీహెచ్‌సీ) ప్రభుత్వ వైద్యశాలలో ఉన్న సదుపాయాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఎవరైనా గుండెపోటుకు గురైతే వెంటనే ప్రభుత్వ వైద్యశాలకు రావాలని, స్టెమ్ యాప్ ద్వారా కార్డియాలజీ డాక్టర్‌తో చికిత్స అందిస్తామన్నారు. మొదటి గంట ముఖ్యమైనదని, ఆ సమయంలో ప్రాణాలు కాపాడేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అవసరమైన వారికి ఖరీదైన ఇంజక్షన్లు ఉచితంగా అందిస్తామని, గుండెపోటుకు గురైన వ్యక్తికి షాక్ (డీఫిబ్రలేట్) ఇచ్చే పరికరాలు అందుబాటులో ఉన్నాయని డాక్టర్లు తెలిపారు. ఇప్పటి వరకు పదిమందికి పైగా గుండెపోటుకు గురైన వారికి వేంపల్లెలో చికిత్స అందించి కాపాడినట్లు తెలిపారు. డాక్టర్లు షెహెన్‌షా, షావున్నీషా, గోవర్ధన్, వైద్యసిబ్బంది, స్టాఫ్‌నర్సులు పాల్గొన్నారు.

చెన్నూరు: గుండెపోటుకు గురైన వ్యక్తి ఆ సమస్య నుంచి గట్టెక్కాలంటే మొదటి గంటలోపే అందే చికిత్సే అత్యంత కీలకమని ఇది స్టెమీతోనే సాధ్యమని సీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ హరీశ్ అన్నారు. స్టెమీతో గుండెకు భరోసాపై మండలంలోని వైద్య, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలకు స్థానిక ఎంపీడీఓ సభా భవనంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌సీ వైద్యాధికారిణి సాగర్‌కుమారి, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ చెన్నారెడ్డి, వైద్యులు వంశీకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

యానిమేటర్ పై చర్యలు తీసుకోవాలి

ముద్దనూరు ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి):వెలుగు గ్రూపు సభ్యులను మోసగించిన యానిమేటర్‌పై చర్యలు తీసుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ జమ్మలమడుగు నియోజకవర్గ సమితి కార్యదర్శి ఎం.వి.సుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కొందరు వెలుగు యానిమేటర్లు గ్రూపు సభ్యులను నమ్మించి మోసం చేస్తున్నారన్నారు. యానిమేటర్‌పై చర్యలు తీసుకుని గ్రూపు సభ్యుల నుంచి దోచుకున్న సొమ్ము రికవరీ చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు మధు, ఏఐఎస్ఎఫ్ నాయకులు అరీఫ్, భవాణి శంకర్, రఘునాథరెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

జమ్మలమడుగు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రతి వాహనదారుడు రోడ్డు నిబంధనలు పాటించి ప్రమాదాలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జమ్మలమడుగు అర్బన్ సీఐ లింగప్ప సూచించారు. శుక్రవారం సాయంత్రం జమ్మలమడుగు పట్టణంలోని పాత బస్టాండు, ముద్దనూరు రోడ్డు, తదితర ప్రాంతాల్లో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రామక్రిష్ణ, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్య పై వాగ్వాదం

ముద్దనూరు ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి):స్థానిక తహసీల్దారు కార్యాలయం పరిధిలో శుక్రవారం భూ సమస్య పై ఇరువురు వ్యక్తులు వాగ్వాదం చేసుకున్నారు.దేనేపల్లి గ్రామానికి చెందిన ఇరువురు వ్యక్తులు గతంలో చింతకుంట గ్రామ పరిధిలో ఇచ్చిన అసైన్‌మెంట్ భూమి విషయమై ఇరువురు వాగ్వాదం చేసుకున్నట్లు సమాచారం. అయితే పోలీసులు సంఘటనాస్థలానికి చెరుకోవడంతో వివాదం సద్దుమణిగింది.

50 మందికి కంటి పరీక్షలు

దువ్వూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 50 మందికి శుక్రవారం కంటి పరీక్షలు నిర్వహించినట్లు వైద్యుడు సురేష్‌బాబు తెలిపారు. ప్రొద్దుటూరు అబిలాష్ కంటి ఆస్పత్రికి సంబంధించిన వైద్యులు గురుమూర్తి, గురు అభిలాష్ ఈ పరీక్షలు నిర్వహించారని చెప్పారు. 50 మందిలో పది మందికి కంటి శుక్లం ఆపరేషన్ అవసరమని, వారిని ప్రొద్దుటూరు ఆస్పత్రికి చికిత్సకు సిఫార్సు చేస్తున్నట్లు వైద్యులు వివరించారు.

‘ సమస్యలు పట్టని మున్సిపల్ పాలక వర్గం ’

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకత్వంలోని మున్సిపల్ పాలక వర్గానికి ప్రజా సమస్యలు పట్టడంలేదని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ ఎస్.ఇర్ఫాన్‌బాష విమర్శించారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనవరి 31వ తేదీ జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి చట్టబద్ధత లేదని వైసీపీ నాయకులు ప్రకటించడం దారుణమన్నారు.

అక్రమ నిర్మాణాల తొలగింపు



బద్వేలు, ఫిబ్రవరి7 (ఆంధ్రజ్యోతి) : బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని చెన్నంపల్లె గ్రామ సర్వేనెంబరులో 1580-ఎ లో సుమారు 1.50 ఎకరాలు ఆక్రమణ చేసి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారనే సమాచారం మేరకు సంబంధిత స్థలం వద్దకు చేరుకుని అక్రమ నిర్మాణాలు తొలగించినట్లు తహసీల్దారు ఉదయభాస్కర్ రాజు పేర్కొన్నారు. పట్టణంలో ఇలాంటి అక్రమ నిర్మాణాలను ఒక్కొక్కటిగా తొలగిస్తూ ప్రక్షాళన చేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు ఆక్రమణ దారులు ఎంతటి వారైనా చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ జగదీశ్వర్‌రెడ్డి, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ సూర్య కుమార్ గ్రామ రెవెన్యూ సహాయకులు రమణ, సుబ్బరాయుడు ,ఎస్ఐ రవికుమార్ పాల్గొన్నారు.

ఆటపాటలతో అమ్మ భాషకు బీజం

●ఆంగ్లంతో పాటు తెలుగుకు ప్రాధాన్యం ●చిన్నారులకు చింతలేదిక ●అంగన్వాడీ కేంద్రాలకు కొత్త పాఠ్యపుస్తకాలు

ప్రొద్దుటూరు రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆట పాటలతో పాటు తెలుగు భాషకు ప్రాధాన్యత కల్పిస్తూ బోధన చేసేందుకు చర్యలు చేపట్టారు. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న పుస్తకాల పండుగ రానే వచ్చింది. చిన్నారుల్లో సృజనాత్మకత శక్తిని వెలికితీసేలా పీపీ-1, పీపీ-2 పుస్తకాలు అంగన్వాడీ కేంద్రాలకు చేరాయి. ఇంతకాలం ఈ విద్యాసంవత్సరంలో అంగన్వాడీ కేంద్రాలకు పుస్తకాల సరఫరా లేకపోవడంతో బోధనకు ఆటంకం ఏర్పడింది. గతంలో అందించిన పాత పుస్తకాలు, పలకా, బలపంతో సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి ఉండేది. రాష్ట్ర ప్రభుత్వం తాజాగా కొత్తవి సరఫరా చేయడంతో ఇబ్బందులు తొలగాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో కేవలం ఇంగ్లీషులోనే పుస్తకాలు అందజేశారు. కూటమి

●సృజనాత్మకత పెంపొందించేలా బోధన



అంగన్వాడీ కేంద్రాలలో పూర్వ ప్రాథమిక విద్య కోసం సరఫరా చేసిన పుస్తకాలపై పిల్లలు ఆసక్తి చూపుతున్నారు. మాతృభాషలో బోధించడం వల్ల అభ్యాసన సామర్థ్యం పెరుగుతున్నది. 6 సంవత్సరాలు వచ్చిన పిల్లలు 1వ తరగతికి వచ్చేసరికి ముందుగానే అన్ని అంశాలపై అవగాహన ఉండటంతో సులువుగా నేర్చుకునే అవకాశం ఉంటుంది.

అరుణకుమారి, ఐసీడీఎస్ సీడీపీవో, ప్రొద్దుటూరు రూరల్





అంగన్వాడీ కేంద్రాల్లో కొత్త పుస్తకాలతో చిన్నారుల విద్యాభ్యాసం, ఐసీడీఎస్ రూరల్ ప్రాజెక్టుకు చేరిన పుస్తకాలు

ప్రభుత్వం అమ్మ భాష మాధుర్యాన్ని చిన్నప్పటి నుంచే చిన్నారులకు అందించాలనే లక్ష్యంతో తెలుగు పుస్తకాలను అందజేయడం విశేషం.

●5 రకాల పుస్తకాలు ..: చిన్నారులకు స్పోకెన్ ఇంగ్లీషు పుస్తకాలతో పాటు తెలుగు వర్క్ పుస్తకం, అభ్యసన, గణితం, బొమ్మల పుస్తకాలు సరఫరా చేశారు. వివిధ రకాల కాయ గూరలు, జంతువులు, పక్షులు వంటివి గుర్తించేందుకు వీలుగా బొమ్మలు, గ్రాఫ్‌లను వాటిలో పొందుపరిచారు. వీరికి సంబంధించిన పుస్తకాలు ఇటీవల సీడీపీవో ప్రాజెక్టులకు చేరడంతో అక్కడి నుంచి అన్ని అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా చేశారు. గతంలో చిన్నారులకు నాలుగు పుసకాలు ఉండేవి. ప్రస్తుతం ఒక్కొక్కరికి అయిదు చొప్పున అందించారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉండేందుకు ప్రభుత్వం సరఫరా చేసే కోడిగుడ్లతోపాటు వివిధ రకాల పౌష్టికాహారం అందిస్తున్నారు.

●ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఇలా..: ప్రొద్దుటూరు రూరల్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ప్రొద్దుటూరు మండలం, రాజుపాళెం మండలంలో మొత్తం 8821 మంది పిల్లలు ఉన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు ప్రస్తుతం పూర్వ ప్రాథమిక విద్య అందిస్తున్నారు. మూడేళ్లలోపు చిన్నారులకు ప్రీప్రైమరీ-1, 3 నుంచి 6 ఏళ్లలోపు వారికి ప్రీప్రైమరీ-2 గా విభజించి బోధిస్తున్నారు. వైసీపీ హయాంలో అమ్మభాషను నిర్లక్ష్యం చేశారు ఫలితంగా ప్రాథమిక దశలోనే మాతృభాష వికాసం పిల్లల్లో కొరవడి పాఠశాల విద్యలోనే రాణించలేని పరిస్థితి ఏర్పడింది. కూటమి ప్రభుత్వం వచ్చాక అంగన్వాడీ కేంద్రాల్లో తెలుగును పరిచయం చేస్తున్నారు. ఇందుకోసం తెలుగు అధ్యాపక దీపిక అందించేందుకు శ్రీకారం చుట్టారు. ఆటపాటలతోపాటు చదువులపై చిన్నారుల్లో మక్కువ పెంచేందుకు పుస్తకాల పేజీల ను ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. అంగన్వాడీ చిన్నారులకు ఆంగ్లం, తెలుగు భాషల్లో పుస్తకాలు సరఫరా చేయడంతో తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సమస్యలు పరిష్కారం

ముద్దనూరు ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి):మేజర్ గ్రామ పంచాయితీ అధికారులు ప్రజల సమస్యలను పరిష్కరిస్తున్నారు.ఈనెల 3వ తేదీన ఆంధ్రజ్యోతి దినపత్రికలో పేరుకే మేజర్ గ్రామ పంచాయతీ.. అభివృద్ధి శూన్యం,పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు అన్న కథనం ప్రచురించడం జరిగింది.దీనికి గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి, తక్షణ చర్యలు చేపట్టారు.వనంలో గ్రామ ప్రజల తాగునీటి కోసం అదనపు బోరు వేసి, మోటారు, పైపులు అమర్చారు.రైల్వే బ్రిడ్జి వద్ద నున్న వంక వద్ద రోడ్డుకు అడ్డంగా తీసిన మురికి కాల్వకు కాంక్రీట్‌తో కాల్వను ఏర్పాటు చేసి వాహనం నడిచేందుకు సౌకర్యం కల్పించారు.గండికోట వాటర్ పథకం కు సంబంధించి సంపు శుభ్రం చేసి ట్యాంకు ద్వారా నీటి సరఫరాకు పనులు చేస్తున్నామని ఈవో నరసింహులు తెలిపారు.ఇక పులివెందుల రోడ్డులోని నాలుగు రోడ్ల నుంచి జమ్మలమడుగు రోడ్డులోని రైల్వే గేట్ల వరకు రోడ్డు విస్తరణ, డ్రైనేజీ పనులు మొదలు పెట్టాల్సి ఉంది.





రైల్వే బ్రిడ్జి వద్ద మురుగునీరు పోయేందుకు కాంక్రీట్‌తో ఏర్పాటు చేసిన కాలువ, వనంలో అమర్చిన కొత్త బోరు, మోటారు, పైపులు

నేడు విద్యుత్ అంతరాయం

ఖాజీపేట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): రెండో శనివారం సందర్భంగా విద్యుత్తు మరమ్మతులు చేస్తున్నట్లు విద్యుత్తు శాఖ ఏఈ నాగరాజు అన్నారు. శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నాం 1 గంట వరకు విద్యుత్తు అంతరాయం జరుగుతుందని, వినియోగదారులు సహకరించాలన్నారు.

బీసీ హాస్టల్‌లో మౌలిక సదుపాయాలు కల్పించండి

బద్వేలు, ఫిబ్రవరి7 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని బీసీ హాస్టల్ విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి బద్వేలు గురుమూర్తి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని బీసీ హాస్టల్‌లో విద్యార్థులతో సమస్యలు, సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం హాస్టల్‌లోని విద్యార్థులకు నిధులు మంజూరు చేసి సౌకార్యాలు కల్పించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు ఇమాంబీ, పట్టణ అభివృద్ధికమిటీ అధ్యక్షుడు నానబాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రి మహోత్సవ ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

పోరుమామిళ్ల, ఫిబ్రవరి7 (ఆంధ్రజ్యోతి) :పోరుమామిళ్లలోని బాలా త్రిపుర సుందరదేవి , రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 26వ తేదీన జరిగే మహా శివరాత్రి సందర్భంగా దేవ స్థాన కమిటీ , ఆలయ ధర్మకర్త కత్తెరగండ్ల సత్యనారాయణ రెడ్డి, ఆలయ అర్చకుడు మధుస్వామి ఆధ్వర్యంలో ఆహ్వానపత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నాస్తిక మేళాను జయప్రదం చేయండి

చాపాడు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): గుంటూరులోని మంగళగిరి వద్ద చారువాక ఆశ్రమంలో ఈనెల 8, 9 తేదీల్లో జరిగే 33వ జాతీయ నాస్తిక మేళాను జయప్రదం చేయాలని భారత నాస్తిక సమాజం రాష్ట్ర నాయకులు పల్లవోడు రమణ కోరారు. ఈ సభకు తెలుగు రాష్ట్రాల నుంచి పలువురు హేతువాద, నాస్తిక, అభ్యుదయ, వామపక్ష నాయకులు హాజరవుతున్నట్లు తెలిపారు.

డిజిటల్ లావాదేవీలపై అవగాహన ఉండాలి

ఖాజీపేట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరికీ డిజిటల్ లావాదేవీలపై అవగాహన ఉండాలని రిటైర్డు ఏపీజీబీ మేనేజర్ క్రిష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కొత్తపేట జిల్లా పరిషత్ హైస్కూలులో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ విద్యార్థులు, కుటుంబ సభ్యులు, పొదుపు సంఘాల మహిళలు, సైబర్ క్రైం పట్ల జాగ్రత్తగా ఉండాలని ఫోన్లలో వ్యక్తిగత సమాచారం చెప్పవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్మాస్టర్ గాయత్రిబాయి, కెనరా బ్యాంకు ఎఫ్ఎల్‌సీ వీరప్రసాద్, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కలిసికట్టుగా జ్యోతిక్షేత్రాన్ని కాపాడుకుందాం

అచలానంద ఆశ్రమ పీఠాధిపతి నీరజానందస్వామి

కాశినాయన, ఫిబ్రవరి7 (ఆంధ్రజ్యోతి) : కలిసికట్టుగా జ్యోతిక్షేత్రాన్ని కాపాడుకుందామని అచలానంద ఆశ్రమ పీఠాధిపతి నీరజానందస్వామి పేర్కొన్నారు. శుక్రవారం కాశిరెడ్డి నాయన జ్యోతిక్షేత్రంలో భక్తులు ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్షేత్రంలో నిర్మాణంలో ఉన్న కట్టడాలను తరచూ అటవీఅధికారులు అడ్డుకోవడం సమంజసం కాదన్నారు. ఈ విషయంలో రాజకీయాలకు అతీతంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆలయ నిర్మాణానికి సంబంధించి అటవీఅధికారుల అభ్యంతరాలపై రాష్ట్ర ప్రభుత్వ అధినేతల దృష్టికి కూడా తీసుకెళ్లామన్నారు. ఈ కార్యక్రమంలో సాధుసంతులపరివారపు అధ్యక్షుడు శివకుమార్‌స్వామి, విశ్వహిందూపరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, రాష్ట్ర బజరంగ్‌దళ్ సెక్రటరీ సందీప్, వివిధ పార్టీ రాజకీయనాయకులు, భక్తులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నీరజానంద స్వామి

నులిపురుగులపై అశ్రద్ధ చూపకండి

ఖాజీపేట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): నులిపురుగులపై అశ్రద్ధ చూపితే పిల్లల ఆరోగ్య సమస్యలు వస్తాయని వైద్యాధికారి ఆయేషాసుల్తానా అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో అధికారులకు నులిపురుగుల నిర్మూలనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 10వ తేదీన జాతీయ నులిపురుగుల నిర్మూలన దినం సందర్భంగా ఒక్క సంవత్సరం నుంచి 19 సంవత్సరాల వయస్సు ఉన్న వారు 400 ఎంజీ ఆల్‌బెండజోల్ మాత్ర వేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి ఇన్‌చార్జి ఎంపీడీవో వెంకటరమణ, ఎంఈవో నాగరాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ఆరోగ్య విస్తరణాధికారి నాగభూషణం, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బీసీ రుణాల దరఖాస్తు గడువు పెంపు

ఎర్రగుంట్ల, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ ద్వారా ఇచ్చే సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకునేందుకు గడువును ఈనెల 12వరకు పొడిగించినట్లు ఎంపీడీవో వెంకటరమణ తెలిపారు. రుణాల దరఖాస్తుకు 7వ తేదీ చివరి తేదీగా ఇప్పటివరకు నిర్ణయించారు. అయితే బీసీ, ఈడబ్ల్యూఎస్, కాపు, లబ్ధిదారుల నుంచి వస్తున్న వినతుల మేరకు ఆయా కార్పొరేషన్లు ఇస్తున్న రుణాలకోసం గడువును ఫిబ్రవరి 7 నుంచి 12వరకు పొడిగించినట్లు జిల్లా బీసీ కార్పొరేషన్ కార్యనిర్వహణాధికారి జయసింహా కూడా ఒక ప్రకటనలో తెలిపారు. ఏపిఓబీఎంఎంఎస్ వెబ్‌సైట్‌లో చేసుకోవచ్చన్నారు. ఈమేరకు నగరపంచాయతీలో దరఖా స్తు చేసుకునే వారికి కూడా వర్తిస్తుందని కమిషనర్ శేషఫణి తెలిపారు.

42 స్వయం ఉపాధి యూనిట్లు మంజూరు

● 12వ తేదీ వరకు దరఖాస్తుల ఆహ్వానం

దువ్వూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలంలో స్వయం ఉపాధి కల్పన నిమిత్తం 50 శాతం సబ్సిడీతో 42 యూనిట్లు మంజూరైనట్లు ఎంపీడీవో రామకృష్ణయ్య తెలిపారు. ఈ పథకాలకు సంబంధించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునని చెప్పారు. మొదట 7వ తేదీ వరకు గడువు ఉందని, దీన్ని 12వ తేదీ వరకు పెంచినట్లు చెప్పారు. రెండున్నర లక్షలు, రూ.4 లక్షలకు సంబంధించిన ఈ యూనిట్లకు 12వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చునని అన్నారు. కావాలనుకున్నవారు ఆయా సచివాలయాల్లో సమాచారం తెలుసుకోవచ్చునని వివరించారు.

ఈనెల చివరి వరకు దరఖాస్తు గడువు పొడిగించాలి

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కాపు రుణాల కోసం దరఖాస్తు చేసుకునే గడువును ప్రభుత్వం ఈనెల చివరి వరకు పొడిగించాలని కాపు కార్పొరేషన్ స్టీరింగ్ కమిటీ మాజీ సభ్యుడు అల్లం చంద్రశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాపు రుణాల కోసం దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం జనవరి 31 నుంచి ఫిబ్రవరి 7వ తేదీ వరకు అవకాశం కల్పించిందన్నారు. దీనిపై అభ్యంతరాలు రావడంతో ఫిబ్రవరి 12వ తేదీ వరకు గడువు పెంచారని తెలిపారు. రుణాల కోసం తహసీల్దారు కార్యాలయంలో అవసరమైన సర్టిఫికెట్లు తీసుకోవడానికి సమయం సరిపోదని, అందువలన ఈనెల 28వ తేదీ వరకు గడువు పెంచాలని కోరారు. ఈ సమావేశంలో వెంకటేశ్, సుబ్రహ్మణ్యం, సాయివంశీ, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

జమ్మలమడుగు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని ముద్దనూరు రోడ్డులో అయ్యప్పస్వామి గుడి సమీపాన శుక్రవారం తెల్లవారుజామున కూలీలతో వచ్చే ఆటో ఎదురుగా వచ్చిన బొలెరోకు ఢీకొంది. ముద్దనూరువైపు నుంచి ఆటో 13 మంది కూలీలను ఎక్కించుకుని బయల్దేరారు. వారంతా ఎర్రగుంట్ల ప్రాంతానికి చెందినవారుగా తెలిపారు. జమ్మలమడుగు వైపు నుంచి ఎదురుగా వచ్చిన బొలెరోకు ఢీకొంది. డ్రైవర్ నాగమునికి తీవ్ర గాయాలు అయ్యాయి. రామాంజనమ్మ, సునీత, ప్రమీళ, నాగమణి, తదితరులు ఆటోలో ఉన్నవారికి గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడినవారిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి మెరుగైన చికిత్స కోసం ప్రొద్దుటూరుకు తరలించారు. ఘటనా స్థలాన్ని పోలీసులు సందర్శించి పరిశీలించారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నీటి పన్ను బకాయిలు చెల్లించకుంటే.. కొళాయి కనెక్షన్ తొలగింపు

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : నీటి పన్ను బకాయిలు చెల్లించకుంటే కొళాయి కనెక్షన్ తొలగిస్తామని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున ఓ ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 10 లోపునీటి పన్ను బకాయిలు మొత్తం చెల్లించాలన్నారు.లేకుంటే మున్సిపాలిటీ చట్టం 1965 సెక్షన్ 117 (4) ప్రకారం ఎటువంటి నోటీసు ఇవ్వకుండానే కొళాయి కనెక్షన్ తొలగిస్తామన్నారు.

రేపు పరుగు పందెం పోటీలు

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): అవయవ దానంపై అవగాహన కల్పించి ప్రజల్లో చైతన్యం తేవడానికి పరుగు పందెం పోటీలు నిర్వహిస్తున్నట్లు కొవ్వూరు గ్రాండ్ చైర్మన్ కొవ్వూరు రమేష్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం కొవ్వూరు గ్రాండ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పరుగు పోటీల్లో పాల్గొనేవారికి అందజేసే టీ షర్టులను ఆవిష్కరించారు. 9వ తేదీ ఉదయం 7 గంటలకు జమ్మలమడుగు రోడ్డులోని రైల్వే ఫ్లైఓవర్ వద్ద నుంచి పరుగు పోటీలు ప్రారంభం అవుతాయన్నారు. ఈ పోటీల్లో గెలుపొందినవారికి నగదు బహుమతులు, మెమెంటోలను అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, డీఎస్పీ భావన, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, తహసీల్దారు పుల్లయ్య, సాధు గోపాలకృష్ణలు పాల్గొంటారని తెలిపారు.

‘మీసేవలో అధిక వసూళ్లు’

ఖాజీపేట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): తహసీల్దారు కార్యాలయ ప్రాంగణంలో ఉన్న మీసేవ లో అధిక వసూళ్లు చేస్తున్నారని బీజేపీ జిల్లా సెక్రటరీ హరిభాస్కర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మీసేవా కేంద్రానికి వెళ్లి రశీదు మాత్రం రూ.50లకే ఇస్తున్నారని, రూ.100 ప్రతి ఒక్కరి వద్ద రాబడుతున్నారని, ఎందుకు అలా చేస్తున్నారని ప్రశ్నిస్తే ప్రింటింగ్ చార్జి తీసుకుంటున్నామన్నారు. ఒక దరఖాస్తుఫారం ఏడెనిమిదిసార్లు రిజెక్టు అయితే ప్రతిసారి వంద రూపాయలు తీసుకుంటున్నారని, అలా వసూలు చేయకూడదని నిబంధన ఉన్నా కూడా అక్రమంగా వసూలు చేస్తున్నారని తహసీల్దారు మహబూబ్‌బాషకు ఫిర్యాదు చేశారు. ఇలాంటివారిపై చర్యలు తీసుకోవాలని వారు తహసీల్దారును కోరారు.

మత్స్యకారుల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

● ప్రతి మత్స్యకారుడు జీవనోపాధి పెంపొందించుకోవాలి: ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్

బ్రహ్మంగారిమఠం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని మత్స్యకారుల అభివృద్ధే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని మైదుకూరు నియోజకవర్గం ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం బ్రహ్మంగారిమఠంలోని బ్రహ్మంసాగర్ ప్రాజెక్టులో చేప పిల్లలను ఆయన వదిలారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ ప్రభుత్వం మత్స్యకారుల అభివృద్ధికోసం కృషిచేస్తోందని పేర్కొన్నారు. చెరువులలో ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద ప్రభుత్వం చేప పిల్లలను వదిలే కార్యక్రమాన్ని చేపడుతోందన్నారు. అందులో భాగంగానే బ్రహ్మంసాగర్‌లో చేప చేప పిల్లలను వదలడం జరిగిందన్నారు. రాబోయే రోజులలో ఈ చేప పిల్లలు పెరిగి వీటి వలన మత్స్యకారుని జీవనోపాధి మెరుగు పడడమే ప్రభుత్వ ఆశయమని ఎమ్మెల్యే సుధాకర్‌యాదవ్ పేర్కొన్నారు. ముఖ్యంగా బ్రహ్మంగారిమఠం మండలంలోని స్థానికంగా ఉండే మత్స్యకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే తెలిపారు.ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ శాంతి, ఎఫ్‌డీఓ కిరణ్‌కుమార్, తహసీల్దారు దామోదర్‌రెడ్డి, ఈవో పీఆర్‌డీ గంగయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు చెన్నుపల్లె సుబ్బారెడ్డి, ముదుమాల పోలిరెడ్డి, ఎస్.ఆర్.శ్రీనివాసుల రెడ్డి, యల్లటూరు సంబశివారెడ్డి, సర్పంచ్ నారాయణ, పుట్టా ప్రభాకర్‌యాదవ్, వెల్లు శ్రీను, నాగయ్య, మేకల సుధాకర్, శ్రీను, బోలా వెంకటసుబ్బయ్య, గుజ్జు రామాంజనేయులు, ఏపీవో హరిక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

